# సమగ్ర శిక్షా అభియాన్

## వృత్యంతర శిక్షణా కార్యక్రమము 2018-19

## సెకండరీ ఉపాధ్యాయ శిక్షణా మార్గదర్శి

## తెలుగు

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి,

హైదరాబాద్, తెలంగాణ.

SCERT TELANGANA

SCERT TELANGANA

# ముందుమాట

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత స్థానిక పరిస్థితులను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన పాఠ్యపుస్తకాలను తయారుచేసుకున్నాం. అవి బోధనలో నూతన విప్లవానికి నాంది పలికాయి. ఉపాధ్యాయ కేంద్రీకృతంగా సాగిన బోధన విద్యార్థి కేంద్రీకృతంగా మారింది. ఉపాధ్యాయుని బోధన – విద్యార్థి అభ్యసనంగా పరిణమించింది.

ఈ మధ్యకాలంలో NCERT 3, 5, 8, 10 తరగతుల విద్యార్థులకు NAS పరీక్ష నిర్వహించారు. వాటిలో ప్రధానంగా ధారాళంగా చదువటం, అర్థం చేసుకొని ప్రతిస్పందించడం, పదజాలసామర్థ్యం... మొదలైన అంశాలను పరీక్షించారు. వాటి ఫలితాలు మనందరికీ తెలిసినవే. మరింత ఉత్తమమైన ఫలితాలు సాధించడానికి లోతైన అవగాహన, శిక్షణ అవసరమున్నది. అందుకోసం ఈ వేదిక ఉపయోగపడుతుంది. అంతేగాక తరగతుల వారీగా సాధించాల్సిన అభ్యసన ఫలితాల (Learning Outcomes) ను NCERT ప్రతి రాష్ట్రానికి చేరవేసింది. వాటి మీద ముఖ్యంగా ఈ శిక్షణా కార్యక్రమంలో దృష్టిసారించాల్సి ఉంది.

ఈ మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు సంసిద్ధులు కావలసిఉన్నది. తమ వ్యూహాలను మార్చుకోవలసి ఉన్నది. అందుకవసరమైన విషయసేకరణకు, భావవినిమయానికి, నైపుణ్యసాధనకు ఒక వేదిక కావలసి ఉన్నది. దానికోసం ఏర్పాటు చేయబడిందే ఈ శిక్షణా కార్యక్రమం.

ఐదు రోజుల శిక్షణాకార్యక్రమంలో రోజువారీగా కాలాంశం వారీగా నిర్వహించే అంశాల విషయ వివరణ, వ్యూహము ఈ శిక్షణా మార్గదర్శిలో పొందుపరచడం జరిగింది. ఇవి అనంతరస్థాయిలో శిక్షణనివ్వడంలో తోడ్పడడమే కాకుండా, తరగతి గదిలో అమలుపరచడానికి కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆశిస్తున్నాం.

**– సంచాలకులు**

SCERT TELANGANA

# తెలుగు ఉపాధ్యాయ శిక్షణామార్గదర్శి

# రూపకల్పనలో పాల్గొన్నవారు

సర్వశ్రీ

1) కె. మహాదేవరెడ్డి, సలహాదారు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

2) పల్లెర్ల రామమోహనరావు, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

3) కందాడై రంగరాజు, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

4) చక్రవర్తుల శ్రీనివాస్, ఎల్.పి., తెలుగు, జి.ప.ఉ.పా. చర్లపల్లి, వరంగల్లు (రూరల్) జిల్లా.

5) అవుసుల భానుప్రకాశ్, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. లోనికలాన్, సంగారెడ్డి జిల్లా.

6) పూదత్తు కృష్ణమోహన్, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. పులిమామిడి, మహబూబ్‌నగర్ జిల్లా.

7) సాగర్ల సత్తయ్య, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. చింతగూడెం, నల్గొండ జిల్లా.

8) కటుకోజ్వల మనోహరాచారి, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. కోరుట్ల, జగిత్యాల జిల్లా.

9) డా॥ మడత భాస్కర్, ఎస్.ఏ., తెలుగు, జి.ప.ఉ.పా. మాటేడు, మహబూబాబాద్ జిల్లా.

10) స్తంభంకాడి గంగాధర్, ఎల్.పి., తెలుగు, జి.ప.ఉ.పా. మల్లాపూర్, కరీంనగర్ జిల్లా.

11) కె.కె.వెంకట శర్మ, ఎల్.పి., తెలుగు, జి.హెచ్.ఎస్. మొగల్‌పుర-1, హైదరాబాద్ జిల్లా.

12) సువర్ణ వినాయక్, ప్రధానోపాధ్యాయులు, ప్రా.పా., కన్నాల, మంథని, పెద్దపల్లి జిల్లా.

13) ఎ. శైలజారాణి, ఎస్.ఏ., తెలుగు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

## సలహా, సమన్వయకర్తలు

డా॥ పి.రేవతి రెడ్డి,
ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాద్.

డా॥ యం.రమాదేవి,
కో-ఆర్డినేటర్ (భాషలు),
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

శ్రీ కె. మహాదేవరెడ్డి,
కో-ఆర్డినేటర్ (తెలుగు),
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

## ప్రధాన సలహాదారులు

శ్రీమతి బి. శేషుకుమారి,
సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి.
హైదరాబాద్.

శ్రీ టి. విజయకుమార్,
సంచాలకులు, పాఠశాల విద్య,
తెలంగాణ.

SCERT TELANGANA

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజి |
|---|---|---|
| 1. | జాతీయ సాధనా సర్వే (NAS) | 5 |
| 2. | వినడం, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం | 8 |
| 3. | ధారాళంగా చదువడం అర్థం చేసుకొని ప్రతిస్పందించడం | 11 |
| 4. | స్వీయరచన | 15 |
| 5. | సృజనాత్మకత | 18 |
| 6. | పదజాల సామర్థ్యం | 22 |
| 7. | భాషాంశాలు (వ్యాకరణాంశాలు) | 25 |
| 8. | నిర్మాణాత్మక మూల్యాంకనం - నిర్వహణ | 28 |
| 9. | తప్పనిసరి బోధనాంశంగా తెలుగు అమలు | 33 |
| 10. | బాలలపై లైంగిక వేధింపులు - ప్రశ్నోత్తరాల ద్వారా అవగాహనాకల్పన | 38 |


SCERT TELANGANA

# శిక్షణా లక్ష్యాలు

- జాతీయ సాధన స్థాయి పరీక్షా ఫలితాలలో తెలంగాణా రాష్ట్ర పరిస్థితి విశ్లేషణ

- పిల్లల స్థాయి ఆశాజనకంగా లేకపోవడానికి గల కారణాలను విశ్లేషించడం.

- అభ్యసన ఫలితాల ఆవశ్యకత, పాఠ్యపుస్తకాలతో గల సంబంధాన్ని అవగాహన చేసుకోవడం.

- సామర్థ్యాల వారీగా పిల్లల స్థాయిని వృద్ధిచేయడంలో సమస్యలను గుర్తించడం, వ్యూహాలను రూపొందించడం, అమలుచేయడం, సాధించడం.

- ప్రధానంగా పఠనావగాహన, స్వీయరచన, సామర్థ్యాల సాధనలోని అవరోధాలను అధిగమించడానికి (అభ్యాసం) వ్యూహాల రూపకల్పన, అమలు, ఆచరణ ద్వారా సాధన.

- తరగతి వారీ అభ్యసన ఫలితాలైన శ్రవణ, భాషణ, పఠన, లేఖనా సామర్థ్యాల ఫలితాల సాధనకై ఆవర్తయత్నాలను చేపట్టడం, సాధించడం.

SCERT TELANGANA

# 1. జాతీయ సాధనా సర్వే (NAS)

**– కె.మహాదేవరెడ్డి, కో–ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.**

సార్వత్రిక గుణాత్మక విద్యా సాధనా మదింపులో భాగంగా దేశవ్యాప్తంగా నవంబర్, 2017 మరియు ఫిబ్రవరి, 2018లో జాతీయ విద్యా శిక్షణ, పరిశోధనా మండలి (NCERT) న్యూఢిల్లీ వారు జిల్లాకు 80 పాఠశాలల చొప్పున ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 5, 8, 10వ తరగతులకు కామన్ పరీక్షను నిర్వహించారు.

NAS కి పరీక్షా ఫలితాలను NCERT తాజాగా విడుదల చేసింది – బాలల సాధన అంతంత మాత్రమేనని తెలిసింది. అభ్యసన విషయాల్లో గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం, ఆంగ్లం, ఆధునిక భారతీయ భాష (MIL)లను పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్ర సగటుతో పోల్చితే జిల్లాల విద్యార్థులు ఫర్వాలేదనే రీతిలో ఉండటం కాస్త ఊరట కల్గించే అంశం.

విద్యార్థులు చాలా మంది ఉత్తీర్ణత సాధించే స్థితిలోలేరని NAS నివేదిక వెల్లడిస్తోంది. 0–35% మార్కులలోపు ఉన్నవారే ఎక్కువ మంది ఉండటం గమనార్హం. ఈ విషయంలో ఆధునిక భాషలో సాధన కాస్త మెరుగ్గా ఉంది!


**విద్యార్థుల మార్కుల సాధనా శాతం**

| విషయం | స్థాయి | 0–35% | 36–50% | 51–75% | 76–100% |
|---|---|---|---|---|---|
| ఆధునిక భాష | జిల్లా | 19.48 | 32.54 | 36.82 | 11.16 |
| | రాష్ట్ర | 19.83 | 29.20 | 40.54 | 10.34 |

ఈ ఫలితాలను విశ్లేషిస్తే ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే మెరుగైన సాధనకు కనబరిచారు. ఆధునిక భాష విషయంలో ప్రభుత్వబడుల్లోని విద్యార్థులు మంచి ఫలితాన్ని సాధించడం విశేషం.


**యాజమాన్యాల వారీగా భాషాభ్యసనంలో ప్రదర్శన శాతం**

| విషయం | ప్రభుత్వ | ఎయిడెడ్ | ప్రైవేటు |
|---|---|---|---|
| ఆధునిక భాష | 52.23 | 58.33 | 51.35 |




ఈ రేఖా చిత్రాలు భాషాసాధన ఎయిడెడ్ పాఠశాలల్లో మెరుగ్గాను, ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే మేలుగా ఉంది.

**ఆధునిక భాష విషయంలో బాలురకన్నా బాలికలే మెరుగైన ప్రదర్శనాశాతం**





బాలబాలికల విషయంలో ప్రదర్శన శాతం.



SCERT TELANGANA

### భాషాపరంగా తరగతి వారీగా సగటు (రాష్ట్ర / జిల్లా)




ఈ ఫలితాల్లో 8, 5వ తరగతుల భాషాసాధన రాష్ట్ర స్థాయి కంటే జిల్లాల్లోనే బాగుంది.

8వ తరగతికి సంబంధించి 37,659 మంది విద్యార్థుల్లో భాషాభ్యసన ఫలితాల వ్యాప్తి ఇలా ఉంది :

| 30% లోపు | 30-50% | 50-75% | 75% పైన |
|---|---|---|---|
| 17.0 | 28.7 | 39.0 | 15.4 విద్యార్థుల ప్రతిభ కన్పిస్తోంది. |


### పాఠశాల ప్రాంతం వారీగా భాషాభ్యసనం





ఈ రేఖా చిత్రంలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రగతి కాస్త మెరుగే.

ఈ రేఖా చిత్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల ప్రగతి రాష్ట్ర స్థాయిలో సమానంగా ఉండడం ముదావహం.

### సామాజిక వర్గాల వారీగా భాషాభ్యసనం




ఈ రేఖా చిత్రంలో రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల భాషా ప్రగతి జనరల్, ఎస్.సి., ఓ.బి.సి., ఎస్.టి. వారీగా 65 నుండి 70 శాతం వరకు ప్రదర్శితమైంది.




ఈ రేఖా చిత్రంలో జాతీయ స్థాయిలో విద్యార్థుల భాషా ప్రగతి జనరల్, ఓ.బి.సి., ఎస్.సి., ఎస్.టి. వారీగా 69 నుండి 66 శాతం వరకు ప్రదర్శితమైంది.

SCERT TELANGANA

- రేఖా చిత్రాలను విశ్లేషిస్తే భాషాభ్యసనం రాష్ట్రంలో కంటే జిల్లాల్లోనే మెరుగ్గా ఉందని తేలింది.
- విద్యార్థుల మెరుగైన భాషాసాధన 50-75% మధ్య 39.0% వారిలో ప్రతిబింబిస్తున్నది. ఇది యితర సబ్జెక్టుల్లో కంటె మెరుగ్గా ఉండడం ప్రశంసనీయం.
- పాఠశాల ప్రాంతాల వారీగా చూస్తే భాషాసాధన పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో మెరుగ్గా ఉందని తేలింది.
- సామాజిక వర్గాల విద్యార్థుల వారీగా చూస్తే భాషాభ్యసనం జాతీయ స్థాయిలో 'జనరల్' అభ్యర్థుల్లో అత్యంత మెరుగ్గాను (69%) ఎస్.టి.లలో (66%) అల్పంగాను కన్పిస్తుంది.
- రాష్ట్ర స్థాయిలో 'జనరల్' విద్యార్థుల్లో అత్యంత అధికంగా (70%)ను, ఎస్.టి.లలో కేవలం 65%గాను కన్పించింది.

దీంతో భాషోపాధ్యాయులు పట్టణ, ప్రైవేటు విద్యార్థుల్లో ఎస్.టి. వారి పట్ల మరింత శ్రద్ధతో భాషాభ్యసనానికి పరిపుష్టి చర్యలు చేపట్టాలన్న సత్యాన్ని గ్రహించి, వైయక్తిక వ్యూహంతో భాషాభ్యసన సాధనకు నడుంబిగించాలి.

### 10వ తరగతి అభ్యసన ఫలితాలపై NAS :

ఈ పరీక్షలో 5 గద్యాంశాలు ఇవ్వబడినాయి. అవి : భావావగాహన, అర్థగ్రహణం, వ్యాకరణాంశాలు, అలంకారాలు, సమాసాలు వంటి వాని గుర్తింపుపై జరిగింది. ఈ గద్యాలన్నీ అపరిచితాంశాలే. ఈ ఫలితాలను దృష్టిలోనుంచుకొని ఉపాధ్యాయులు చేపట్టవలసిన, గుర్తుంచుకోవలసిన అంశాలు :

- విద్యార్థుల్లో ఆశించిన అభ్యసన ఫలితాల సాధనలో :
  - మదింపు తరువాత ఆవర్తయత్నాలు చేపట్టడడం.
  - బోధనాభ్యసన సామాగ్రిని సమకూర్చుకోవడం, వినియోగించడం.
  - విద్యార్థుల స్థాయి వారీగా అభ్యసనా శాస్త్ర ప్రయోగాలను అమలుచేయడం.
  - అభ్యసనంలోని లోపాలను గుర్తించడం - పునర్బోధన చేపట్టడడం, సాధించడం.
  - ఆశించిన అభ్యసన ఫలితాలను తరగతి బోధనతోబాటు మదింపు చేయడం తప్పనిసరి.
  - స్వీయాభ్యసనానికి వ్యూహరచన - అమలు - సాధన ముఖ్యం.
  - అభ్యసన ఫలితాల ప్రదర్శన - పోస్టర్ల వినియోగం చేపట్టడం.
  - పాఠ్య పుస్తకాల్లో విషయవారీగా అభ్యసన ఫలితాలను చేర్చడం.
  - ఉన్నత గమ్యాలైన సృజనాత్మకత, సునిశిత యోచనలకు ఆస్కారమివ్వడం.
  - సందర్భానుసారంగా వనరులను వినియోగించడం, తగిన అభ్యసనా విధానాలను రూపొందించుకొని అమలుచేయడం.
  - ప్రత్యేకావసరాలుగల బాలల్లో "సహిత తరగతుల నిర్వహణ". (Inclusive Class Management)

**ఉపయుక్తాంశాలు :**

- **జాతీయ విద్యా ప్రణాళికా చట్రం - 2005** - అభ్యసన ఫలితాలపై చర్చ - అమలు - సాధన.
- **విద్యా హక్కు చట్టం - 2009** - అమలులో ఉపాధ్యాయ బాధ్యతలు - సాధన - జవాబుదారీతనం.
- **తెలుగు బోధనాభ్యసన శాస్త్రం (పెడగోజి)** - బి.ఇ.డి., డి.ఎల్.ఇ.డి., భాషా పండిత శిక్షణాశాస్త్రాలు.

SCERT TELANGANA

# 2. వినడం, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం

*- స్తంభంకాడి గంగాధర్, చక్రవర్తుల శ్రీనివాస్, అవుసుల భానుప్రకాశ్*

**పరిచయం :**

జానపదాల నుండి వేదాల దాకా కొన్ని వేల సంవత్సరాలపాటు మన భాషా సాహిత్యాలు మౌఖిక రూపంలోనే కొనసాగాయి. లిఖిత రూపాన్ని పొందకున్నా, ఇసుమంతైనా లోపంలేని జ్ఞానాన్ని భావితరాలకు అందించగలిగారంటే ఇందుకు ప్రధాన కారణం విని, అర్థం చేసుకొని మాట్లాడగలిగే సామర్థ్యం. ఈ సామర్థ్యమే బోధనాభ్యసన ప్రక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది. ఉపాధ్యాయుడు బోధించే అంశాలను విద్యార్థి విని, పాఠ్యపుస్తకంలోని చిత్రాలు చూసి అర్థం చేసుకొని, ఆలోచించి ప్రతిస్పందించగలిగితే 'వినడం, అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం' సామర్థ్యం అవుతుంది.

బోధనాభ్యసన ప్రక్రియలో ఈ సామర్థ్యం ముఖ్యమైనది. ఒక విద్యార్థి ఆయా సామర్థ్యాలలో కనబర్చే అభ్యసన ఫలితాలన్నీ ఈ సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటాయి. ఉపాధ్యాయుడు చెప్పిన అంశాలను, తాను చూసిన అంశాలను విద్యార్థి అవగాహన చేసుకొని, ఆలోచించి ప్రతిస్పందించగలిగినప్పుడే మిగతా సామర్థ్యాలను పొందగలడు.

**ఆశించే అభ్యసన ఫలితాలు :**

1) ఉపన్యాసాలు, సందేశాలు, వక్తృత్వాలు, వార్తలు, కథలు విని, అర్థం చేసుకొని ప్రతిస్పందించగలగాలి.

2) తమ ఇష్టాయిష్టాలను, ఆసక్తులను, స్వీయ అభిప్రాయాలను, కారణాలను చెప్పగలగాలి.

3) సమర్థిస్తూ లేదా విభేదిస్తూ / విశ్లేషిస్తూ మాట్లాడగలగాలి.

4) పద్య తాత్పర్యాలను, గేయ / పాఠ్య సారాంశాలను చెప్పగలగాలి.

5) కవి యొక్క ఆలోచనను, పాత్రల స్వభావాన్ని వివరించి చెప్పగలగాలి.

6) సాహిత్య ప్రక్రియలోని భేదాలను గుర్తించి, అవగాహనతో అభిప్రాయాలు వ్యక్తీకరించగలగాలి.

7) చిన్న చిన్న సంఘటనలను వర్ణించగలగాలి.

8) ఇచ్చిన అంశాన్ని గురించి మాట్లాడగలగాలి, చర్చించగలగాలి.

9) పద్యాలు, గేయాలు రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలగాలి.

**సామర్థ్య సాధనలో ఎదురవుతున్న సమస్యలు :**

1) శ్రద్ధతో, ఏకాగ్రతతో వినకపోవడం.

2) ఉపాధ్యాయుడు చెప్పే అంశాన్ని అర్థం చేసుకోకపోవడం.

3) ఆత్మ విశ్వాసం లేకపోవడం.

4) బిడియం వల్ల మాట్లాడలేకపోవడం.

5) అందరు విద్యార్థులు భాగస్వాములు కాకపోవడం.

6) ఉపాధ్యాయుని సూచనలు సక్రమంగా అర్థం చేసుకోలేకపోవడం.



SCERT TELANGANA

7) ఉచ్చారణ దోషాలు కలిగి ఉండడం.

8) ఒక అంశాన్ని వేరే కోణంలో అర్థం చేసుకోవడం.

9) గేయాలు అభినయంతో పాడలేకపోవడం.

10) విద్యార్థుల్లో భాష నేర్చుకోవాలనే ఆసక్తి లేకపోవడం.

11) బోధనాభ్యసన ప్రక్రియలు విద్యార్థి కేంద్రీకృతంగా కాకుండా ఉపాధ్యాయ కేంద్రంగా నిర్వహింపబడడం.

12) ఈ సామర్థ్యానికి తక్కువ ప్రాధాన్యతనివ్వడం.

13) ఉపాధ్యాయుడు విద్యార్థులను అనుబంధ ప్రశ్నలు అడుగకపోవడం.

14) విద్యార్థుల చేత మాట్లాడించడానికి తగిన కృత్యాల రూపకల్పన చేయకపోవడం.

15) విద్యార్థులను సొంతమాటల్లో చెప్పడాన్ని ప్రోత్సహించకపోవడం.

16) విద్యార్థులు చూసిన అంశాల గురించి మాట్లాడించకపోవడం.

**సామర్థ్య సాధనకై అనుసరించాల్సిన వ్యూహాలు :**

1) ఒక ప్రశ్నను కాని, ఇతర విద్యార్థులు చెప్పే సమాధానాల గురించికానీ ఒక విద్యార్థిని అడిగినప్పుడు మిగిలిన పిల్లలందరూ వింటున్నారా? లేదా? అనేది తరగతి గదిలో పరిశీలించాలి.

2) పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.

3) తమ స్వీయ అనుభవాలను, తాము చూసిన సంఘటనల గురించి విద్యార్థుల చేత మాట్లాడించాలి.

4) ప్రతి విద్యార్థిని కృత్యంలో భాగస్వామ్యం చేయాలి.

5) తరగతి గదిలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలి.

6) స్పష్టమైన ఉచ్చారణతో విద్యార్థుల తప్పులను సవరించాలి.

7) విద్యార్థులను అభినందనా పూర్వకంగా ప్రోత్సహించాలి.

8) విద్యార్థులను వారి అభిరుచుల గురించి మాట్లాడించాలి.

9) సమర్థిస్తూ, విభేదిస్తూ / విశ్లేషిస్తూ మాట్లాడించాలి.

10) పండుగలు, జాతరల గురించి మాట్లాడించాలి.

11) పద్యాలు, గేయాలు రాగయుక్తంగా, భావయుక్తంగా పాడించాలి.

12) ఉపన్యాసపోటీలు నిర్వహించాలి.

13) కథలు చెప్పించాలి.

14) పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పించాలి.

15) ఒక అంశాన్ని మరొక అంశంతో పోల్చి మాట్లాడడాన్ని ప్రోత్సహించాలి.

16) గేయ భావాలను, పద్య తాత్పర్యాలను చెప్పించాలి.

SCERT TELANGANA

**మాదిరి కృత్యాలు :**

- పద్యం, పాట, గేయం, కవితలు విన్న విద్యార్థి తిరిగి వాటిని రాగ, భావయుక్తంగా, అర్థవంతంగా పాడగలుగుతున్నాడా లేదా పరిశీలించాలి.

  ఉదా॥ అభినందన, ఏకులం? శ్రీలుపొంగిన జీవగడ్డ (గేయాలు), శతక పద్యాలు, చీమలబారు (వచన కవిత), పల్లెటూరి పిల్లగాడా! (పాట) మొదలగునవి.

- వచన అంశాలు చదివేటప్పుడు అర్థవంతంగా, సమవేగంతో, భావస్ఫోరకంగా చదువగలుగుతున్నాడా లేదా పరిశీలించాలి.

  ఉదా॥ స్నేహబంధం (కథ), కాపాడుకుందాం! (సంభాషణ), నాయనమ్మ (కథానిక), ప్రేరణ (ఆత్మకథ) మొదలగునవి.

- మీ స్నేహితులకు మీరు చేసిన సాయం గురించి చెప్పండి. (స్నేహబంధం)
- 'పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత' అనే అంశాన్ని సమర్థిస్తూ మాట్లాడండి. (కాపాడుకుందాం)
- మంచి అలవాట్లు అలవచ్చుకోవడానికి ఏం చేయాలో చెప్పండి. (శతక పద్యాలు)
- పాఠంలో వర్ణించిన ఊరుతో పిల్లలు తాము చూసిన ఊరును పోల్చి మాట్లాడండి. (పల్లె అందాలు)
- కథలో ఆశ్చర్యం కలిగిన సంఘటనల గురించి మాట్లాడండి. (రాణి శంకరమ్మ)
- తెలిసిన జానపద గేయాలను పాడండి. (తెలుగు జానపద గేయాలు)
- నదుల్లో నీరు కనుమరుగయ్యే పరిస్థితి రావడానికి గల కారణాలను వివరించండి. (మంజీర)
- స్వాతంత్ర్యానికి ముందు గ్రామాల్లో పరిస్థితులు ఎట్లా ఉండేవో పాఠం ఆధారంగా ఊహించి మాట్లాడండి. (చిన్నప్పుడే)
- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల గురించి మాట్లాడండి. (అమరులు)
- రైతు పరిస్థితిని గురించి, జీవన విధానాన్ని గురించి మాట్లాడండి. (కాపు బిడ్డ)

SCERT TELANGANA

# 3. ధారాళంగా చదువడం అర్థం చేసుకొని ప్రతిస్పందించడం

- అవుసుల భానుప్రకాశ్, చక్రవర్తుల శ్రీనివాస్

**పరిచయం :**

పరిచిత అపరిచిత అంశాలను, పట్టికలను, అక్షర రూపంలో ఉన్న అంశాలను స్పష్టంగా, ధారాళంగా, విరామచిహ్నాలను పాటిస్తూ, భావానికి తగినట్లు, సందర్భానుగుణంగా చదువాలి. చదివిన విషయాన్ని అవగాహన చేసుకోవాలి. తరువాత ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. ప్రశ్నలు తయారుచేయగలగాలి. బహుళైచ్ఛిక ప్రశ్నలకు సరైన సమాధానం గుర్తించగలగాలి. ఖాళీలు పూరించగలగాలి. చదివిన విషయంలోని కీలక పదాలు గుర్తించగలగాలి. విషయం మీద ఎలాంటి ప్రశ్నలడిగినా జవాబులు సాధించగలగాలి. చదువడం వాచిక చర్య అయితే అవగాహన చేసుకోవడం మానసిక చర్య. ఈ రెండు అవినాభావ సంబంధమైనవి. వీటికి ప్రతి చర్యలు ప్రతిస్పందించడం. ధారాళంగా చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలవారు అన్ని రకాల అభ్యసన ఫలితాలను సాధించగలుగుతారు అన్నది అక్షర సత్యం.

**ఆశించిన అభ్యసన ఫలితాలు :**

- పద్యం, వచనం, పాట, గేయం, సంభాషణ, పట్టిక తదితర అంశాలను ధారాళంగా స్పష్టంగా చదువగలగాలి. అవగాహన చేసుకోగలగాలి. అభిప్రాయం చెప్పగలగాలి.
- చదువుతున్న అంశాలలోని కీలకాంశాలను గుర్తించగలగాలి. అంశానికి శీర్షికను సూచించగలగాలి. అర్థం చేసుకొని ప్రతిస్పందించగలగాలి.
- పరిచిత అపరిచిత అంశాన్ని అర్థం చేసుకొని పట్టికలు రాయడం, ప్రశ్నలు తయారుచేయడం, ఖాళీలను పూరించడం, తప్పొప్పులు గుర్తించడం, పోలికలు రాయడం, మొదలైనవాటిపై తన అభిప్రాయాలను మౌఖికంగా మరియు లిఖిత పూర్వకంగా వ్యక్తీకరించగల్గాలి.
- చదివిన అంశంలోని సామెతలను, జాతీయాలను గుర్తించగలగాలి.
- తెలుగులోని వివిధ రకాల పఠన సామగ్రిని చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలగాలి. వాటిలోని విశేషాంశాలను గుర్తించగలగాలి. లిఖిత రూపంలో వ్యక్తీకరించగలగాలి.
- విద్యార్థి స్థాయికి అనుగుణంగా అభ్యాసాలకొరకు వివిధ రూపాల్లో అంశాలు సిద్ధం చేసుకుంటే సాధనకు ఉపయుక్తంగా ఉంటుంది.
- పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- గేయం పద్యం భావం ఆధారంగా పంక్తులను గుర్తించగలగాలి.

SCERT TELANGANA

**సామర్థ్య సాధనలో ఎదురవుతున్న సమస్యలు :**

- విద్యార్థులు స్పష్టంగా ధారాళంగా చదువలేకపోవడం.
- చదివిన విషయాన్ని అర్థం చేసుకోలేకపోవడం.
- ప్రశ్నలకు జవాబులు రాయలేకపోవడం.
- ప్రశ్నలు తయారుచేయలేకపోవడం.
- కీలక పదాల గుర్తింపులో వెనుకబాటు.
- ప్రశ్నకు చెందిన పదం పేరాలో వెతికి ఆ వాక్యం యథాతథంగా రాయడం.

**సామర్థ్య సాధనకై వ్యూహాలు :**

- పిల్లలకు ఆసక్తి కలిగే అంశాలు చదివే అవకాశం కల్పించడం.
- చదువుతున్నప్పుడే తర్వాత వాక్యాన్ని ఊహించేలా తెలిసిన అంశాలు చదివించడం.
- సరళ వాక్యాలతోకూడిన బాలసాహిత్యం అందుబాటులోకి తేవడం.
- పలికిన ధ్వనికి లిఖిత రూపానికి అనుసంధానం కుదిరేలా వీలైనన్ని ఎక్కువసార్లు చదివించడం.
- సమూహాలుగ చేస్తూ స్వయం అభ్యసనకు అవకాశమివ్వడం.
- చదివిన విషయంపై మాట్లాడించడం.
- స్వీయ అభిప్రాయాలను, అనుభూతులను రాయించేలా అవకాశం కల్పించడం.
- పేరాను అర్థం చేసుకోవడంలో కీలక అంశాలను, కీలక వాక్యాలను గుర్తించేలా సాధన చేయించడం.
- చదివిన వాక్యాలకు దృశ్యీకరణం చేసుకోవడం.
- ఊహాశక్తి పెంపొందేలా మాట్లాడించడం.
- కనీస సామర్థ్య సాధనలో భాగంగా పఠన లేఖన నైపుణ్యాలు వృద్ధిపరచడం. స్వీయ కార్యాచరణ రూపొందించుకోవడం.
- దోష రహితంగా ఉచ్చరించేటట్లు సాధన చేయించటం.
- విషయాన్ని ఒకటికి రెండుసార్లు చదివి విశ్లేషణ చేసుకునేట్లు ప్రోత్సహించడం కీలకాంశాలను గుర్తించే విధంగా చదివే విధానం అలవాటు చేయడం.
- ప్రశ్నల్ని చదివి ఆలోచించే విధంగా అభ్యాసాలను కల్పించడం.
- ప్రశ్నలు తయారుచేయడానికి (5 W's 1 H విధానం ద్వారా) వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలు తయారుచేసేటట్లు అభ్యాసాల సాధన నిర్వహించడం.
- మాదిరి ప్రశ్నలను అధ్యయనం చేయిస్తూ విశ్లేషణ కలిగించడం.
- జాతీయాలు, కీలక అంశాలపట్ల స్పష్టమైన అవగాహన కలిగించి గుర్తించేలా సాధన చేయడం.
- ఉన్నత తరగతుల్లో ప్రతి పదార్థం రాసేటప్పుడు అన్వయక్రమం అలవాటుచేయడం, నిఘంటు వినియోగం ద్వారా సాధించడం.
- చదవడం అలవాటుగా చేసుకునేటట్లు ప్రోత్సహించడం, విస్తారపఠనం ద్వారా పఠనం అలవర్చడం. చదివిన విషయంపై అవగాహనను పరీక్షించడానికి వీలైనన్ని రకాలుగా వీలైనన్ని ప్రశ్నలు అడగడం.



SCERT TELANGANA

**నమూనా / మాదిరి :**

భూగర్భ జలాలకు చెరువు శ్రీరామరక్ష. చెరువు అలుగు పారిందంటే కరువు తోక ముడిచినట్లే! చెరువు నీరు ఊరికి ప్రాణాధారం. మానవాళినే కాదు పశుపక్ష్యాదులను అక్కున చేర్చుకునే అన్నపూర్ణ చెరువు. వ్యవసాయానికి ప్రధాన వనరు కూడా! అందమైన తామరలతో శోభిల్లే చెరువు సుందరమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది. ఆటపాటల నిలయమై అలరారుతుంది. ఆబాల గోపాలాన్ని మురిపిస్తుంది. ఇంత వైభవమున్న చెరువుకు సాహిత్యంలోనూ ప్రత్యేక స్థానమున్నది. అంతేకాదు. బతుకమ్మలను తన ఒడిలోకి చేర్చుకునే మెట్టినిల్లు చెరువు. ప్రకృతికే సౌందర్యం పులిమే చెరువు గూర్చి మాటల్లో ఎంత వర్ణించినా అది తక్కువే! జలసిరులతో కళకళలాడిన చెరువు ఆధునిక కాలంలో కాలుష్యం కోరల్లో చిక్కుకొని విలవిలలాడుతోంది. చెరువులకు పూర్వవైభవం తేవడానికి అందరం చేయి చేయి కలుపుదాం! పునర్వైభవం తీసుకువద్దాం!!

**1) పై పేరాలో కీలక పదాలు గుర్తించండి.**

అ) భూగర్భజలం

ఆ) వ్యవసాయం

ఇ) ప్రాణాధారం

ఈ) కాలుష్యం

ఉ) సాహిత్యం

ఊ) పర్యాటక కేంద్రం

ఋ) ప్రకృతి సౌందర్యం

ౠ) బతుకమ్మ

**2) పై పేరాలో కీలక వాక్యాలు గుర్తించండి.**

అ) చెరువు నీరు ఊరికి ప్రాణాధారం

ఆ) పశుపక్ష్యాదులను అక్కున చేర్చుకునే అన్నపూర్ణ

ఇ) చెరువుకు సాహిత్యంలో ప్రత్యేక స్థానం

ఈ) సుందరమైన పర్యాటక కేంద్రం చెరువు

ఉ) ప్రకృతికే సౌందర్యం పులమడం.

**3) పై పేరా ఆధారంగా ఖాళీలు పూరించండి.**

అ) వ్యవసాయానికి ________________ కీలకం.

ఆ) చెరువు నీరు ఊరికి ________________.

ఇ) చెరువు ________________ కు నిలయమై అలరారుతుంది.

ఈ) చెరువులకు ________________ తేవాలి.

ఉ) తన ఒడిలోకి ________________ లను చేర్చుకుంటుంది.

SCERT TELANGANA

**4) పై పేరా ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ) చెరువు ప్రాధాన్యత ఏమిటి?

ఆ) కరువు ఎప్పుడు తొలగిపోతుంది?

ఇ) పర్యాటక కేంద్రం అంటే ఏమిటి?

ఈ) చెరువులు ఎట్లా కలుషితం అవుతున్నాయి?

ఉ) పై పేరాకు శీర్షిక సూచించండి.

ఊ) పై పేరా దేని గూర్చి తెలియజేస్తుంది?

**5) పై పేరా ఆధారంగా ప్రశ్నలు తయారుచేయండి.**

అ) చెరువులు ఎవరెవరికి ఉపయోగపడుతున్నాయి?

ఆ) పర్యాటక కేంద్రం అంటే ఏమిటి?

ఇ) కళకళలాడటం అంటే ఏమిటి?

ఈ) భూగర్భజలాలకు ప్రధాన వనరు ఏది?

ఉ) చెరువుల కాలుష్యానికి ఒక కారణం చెప్పండి.

**6) పై పేరా ఆధారంగా తప్పు ఒప్పులను గుర్తించండి.**

అ) 'తోకముడవడం' అంటే అభివృద్ధి చెందడం ( )

ఆ) వ్యవసాయానికి ప్రధాన వనరు చెరువు ( )

ఇ) చెరువుకు సాహిత్యంతో సంబంధం లేదు ( )

ఈ) చెరువులు కలుషితం కావడం లేదు ( )

ఉ) పర్యాటక కేంద్రంగా చెరువును భావించవచ్చు ( )

**7) పై పేరా ఆధారంగా జాతీయాలను గుర్తించి రాయండి.**

అ) శ్రీరామరక్ష

ఆ) ఆబాల గోపాలం

ఇ) మెట్టినిల్లు

ఈ) కళకళలాడు

ఉ) విలవిలలాడు

ఊ) తోకముడుచుకొను

SCERT TELANGANA

# 4. స్వీయరచన

- పూదత్తు కృష్ణమోహన్, సాగర్ల సత్తయ్య

**పరిచయం :**

భావ వినిమయ సాధనం భాష. భావ వ్యక్తీకరణ భావగ్రహణానికి భాష వాహకంగా ఉండడం వలననే మనిషి ఇతర జంతుజాలంకంటే ఉన్నతస్థితిలో ఉన్నాడు. వ్యక్తి ఆలోచించడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి, ఉద్వేగాలను వ్యక్తం చేయడానికి భాష ఉపయోగపడుతుంది.

భావ వ్యక్తీకరణ రెండు రకాలు :

1) మౌఖిక భావ వ్యక్తీకరణ

2) లిఖితపూరక్వక భావ వ్యక్తీకరణ

- ఆలోచించి, అర్థం చేసుకొని మాట్లాడడం - మౌఖికం అయినది కాగా, స్వీయరచన లిఖిత పూర్వక భావ వ్యక్తీకరణ.

**స్వీయరచన :**

- విద్యార్థి తాను చదివిన, విన్న, నేర్చుకున్న, పరిశీలించిన అర్థం చేసుకున్న అంశాలను తన సొంత ఆలోచనలతో తనదైన శైలిలో రాయగలగడమే స్వీయరచన.
- ఎస్.సి.ఎఫ్.-2011 నిర్దేశించిన విధంగా బట్టీ విధానం రూపుమాపాలంటే సొంతమాటలలో రాయడాన్ని ప్రోత్సహించాలి.
- స్వీయరచనలో భాగంగా ఒక అంశాన్ని కుదించి రాయవలసి ఉంటుంది. ఒక అంశం / విషయమునకు సంబంధించిన మంచి - చెడులను చర్చించవలసి ఉంటుంది. కారణాలను సూచిస్తూ, పరిష్కారాలను ఊహించి రాయాల్సి ఉంటుంది. పాత్రల స్వభావాన్ని విశ్లేషించవలసి ఉంటుంది. పోలికలను, తేడాలను రాయవలసి ఉంటుంది. ప్రకృతిని, పరిసరాలను, సమాజాన్ని పరిశీలించి తన అభిప్రాయాలను రాయవలసి ఉంటుంది.
- వేరు వేరు సందర్భాలలో తర్వాత ఏం జరుగుతుందో, తానే గనక అయితే ఏంచేస్తాడో విద్యార్థి ఊహించి రాయవలసి ఉంటుంది.
- తార్కికమైన ఆలోచనతో రాయవలసి ఉంటుంది.

**స్వీయరచన సామర్థ్యం ఆశించే అభ్యసన ఫలితాలు :**

- విద్యార్థులు తాము విన్న, చదివిన, అర్థం చేసుకున్న విషయాలను అనుభూతులను, అనుభవాలను సొంతమాటలలో స్పష్టంగా రాయగలగాలి.
- విభిన్న సందర్భాలలో రాసేటప్పుడు విద్యార్థులు అవసరమైన నూతన పదాలు వాక్య నిర్మాణాలు, జాతీయాలు, సామెతలు మొదలగు వాటిని తగురీతిలో ఉపయోగించగలగాలి.
- వివిధ రకాల భాషా పఠన సామగ్రి చదివి, అర్థం చేసుకొని విద్యార్థి తన ఇష్టాఇష్టాలను, అభిప్రాయాలను సహేతుకంగా వివరించగలగాలి.
- చదివే పాఠకులను దృష్టిలో ఉంచుకొని తాను చెప్పదలచుకొన్న అంశాన్ని ప్రభావవంతంగా రాయగలగాలి.
- వివిధ సందర్భాలలో ఇతరులు వ్యక్తపరచిన విషయాలను తన సొంతభాషలో, తనదైన శైలిలో రాయగలగాలి.



SCERT TELANGANA

- విద్యార్థి ఏదైనా రచనను, విషయాన్ని చదివి, రచయిత యొక్క ఉద్దేశాన్ని అర్థం చేసుకొని, దానికి తన స్వీయ అనుభవాలను అన్వయించుకొని సమర్థించడం లేదా వ్యతిరేకించడం చేయగలగాలి.
- విరామ చిహ్నాలను పాటిస్తూ, వాక్య భేదాలను సందర్భోచితంగా ఉపయోగించి రాయగలగాలి.
- గేయం, పాఠం సారాంశాలను సొంతమాటలలో రాయగలగాలి.
- విషయాన్ని విశ్లేషిస్తూ, ఊహిస్తూ, సమర్థిస్తూ, వివరిస్తూ తగిన కారణాలతో రాయగలగాలి.
- భావాలను క్రమపద్ధతిలో సరైన పదజాలాన్ని ఉపయోగించి దోషరహితంగా రాయగలగాలి.
- సూచించిన నిడివికి (5 వాక్యాలు / 10 వాక్యాలు) తగ్గట్టుగా సమాధానాలు రాయగలగాలి.

**స్వీయరచన సామర్థ్యం సాధించడంలో ఎదురవుతున్న సమస్యలు :**

ఈ సామర్థ్య అభివృద్ధిలో తరగతి గదిలో అనేక సమస్యలు విద్యార్థుల ప్రగతిని నిరోధిస్తున్నాయి.

- సొంతంగా రాయాలనే ఆలోచన లేకపోవడం.
- గైడ్లు, స్టడీ మెటీరియళ్ళ , ఇతరుల నోటుపుస్తకాల నుండి చూసి రాయడం.
- సూచించిన నిడివిలో సమాధానం రాయలేకపోవడం.
- తరగతి గదిలో సామర్థ్య నిర్వహణలో విద్యార్థులందరూ భాగస్వాములు కాకపోవడం.
- లేఖనా దోషాల కారణంగా విద్యార్థులు రాయడానికి వెనుకంజవేయడం.
- భావాలను క్రమపద్ధతిలో వ్యక్తీకరించలేకపోవడం.
- పేరాలుగా కాకుండా పాయింట్లవారీగా సమాధానములు రాయడం.
- ఒక విషయాన్ని సమర్థిస్తూ / విభేదిస్తూ సహేతుకంగా రాయలేకపోవడం.
- కవి రచనా శైలిని వివరించలేకపోవడం.
- ఒక వాక్యం / కవి / మాట యొక్క ఉద్దేశాన్ని, అంతరార్థాన్ని రాయలేకపోవడం.

**స్వీయరచన సామర్థ్య సాధనకు వ్యూహాలు :**

స్వీయరచనలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి ఉపాధ్యాయుడు ప్రణాళికాబద్ధమైన వ్యూహాలను అనుసరించాలి.

- స్వీయరచన ప్రశ్నను నల్లబల్లపై రాయాలి.
- తరగతి కృత్యంగా ఆప్రశ్నపై చర్చ జరపాలి. అందరు విద్యార్థులును భాగస్వాములను జేయాలి.
- అవసరమైనచోట విద్యార్థుల సందేహ నివృత్తి చేస్తూ మార్గదర్శనం చేయాలి.
- నల్లబల్లపై రాసిన ప్రశ్నకు సమాధానాన్ని ఒక్కొక్క విద్యార్థిచే ఒక్కొక్క వాక్యం చెప్పించాలి. ఆ వాక్యంలోని కీలక అంశాన్ని (పదాన్ని) నల్లబల్లపై రాయాలి.
- చివరికి ఒకరిద్దరు విద్యార్థులచే సమాధానమును మొత్తాన్ని క్రోడీకరింపజేయాలి.
- నల్లబల్లపై ఉన్న కీలకపదాలను చెఱిపివేసి విద్యార్థులందరిచేత వ్యక్తిగత కృత్యంగా సమాధానాన్ని సొంతమాటల్లో రాయించాలి.



SCERT TELANGANA

- కొద్ది మంది విద్యార్థుల సమాధానములను తరగతిలో ప్రదర్శింపజేయాలి.
- ఉపాధ్యాయుడు విద్యార్థుల దోషాలను సవరించి, తగు సూచనలు చేయాలి.
- వాక్యాలు అన్వయక్రమంలో ఉన్నాయా? లేదా? అని పరిశీలించి, సరిచేసి తగు సలహాలివ్వాలి.
- గైడ్లు, స్టడీమెటీరియళ్ళను పూర్తిగా నిరోధించాలి.
- స్వీయరచన సామర్థ్య నిర్వహణ సమయంలో విద్యార్థులు తమ అభిప్రాయాలు తెల్పడానికి తగినంత స్వేచ్ఛనివ్వాలి. ప్రోత్సహించాలి.
- సొంతంగా రాయడం అంటే ఏది రాసినా సరిపోతుందనే అపోహను విద్యార్థుల మది నుండి తొలగింపజేయాలి. ప్రశ్నకు తగిన సమాధానాన్ని మైండ్ మ్యాపింగ్ ద్వారా రాసే క్రమాన్ని వివరించి, అనుసరించేలా చేయాలి.
- కవి శైలిని వివరించే సందర్భంలో కవి పరిచయంలోని విషయాలేగాక పాఠంలోని పద్యాల / గేయాల పంక్తులలోని అలంకారం, పదజాలం, రసానుభూతి, పదాల అల్లిక, అంతరార్థం మొదలైన అంశాలపై చర్చ జరిపి, ప్రశంసించే నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలి.

**స్వీయరచన సామర్థ్యాభివృద్ధి – (సాధన) :**

**మాదిరి–1**

**ప్రశ్న : శతక కవుల వల్ల సమాజానికి ఎట్లాంటి మేలు చేకూరుతుంది? (10 వాక్యాలు)**

నైతిక విలువలు | స్త్రీలపట్ల సోదర భావం

ఇతరుల ధనంపై ఆశపడరాదు | కోపం మంచిదికాదు | మేలు చేయడం

గొప్పలు చెప్పకూడదు | మంచివాళ్ళతో స్నేహం | భేదభావం చూపరాలు

మానవసేవ మాధవసేవ | ఏం చేయాలి? ఏం చేయకూడదు? | తప్పుచేస్తే ఒప్పుకోవాలి

ధారణ శక్తి | ప్రజల తీరులో మార్పు | ఆనందం

- ఇలా ఒక్కొక్క విద్యార్థి చెప్పిన వాక్యాలలోని కీలక పదాలను నల్లబల్లపై రాసి విద్యార్థులకు అవగాహన కలిగించాలి.
- ఒకరిద్దరు విద్యార్థులచే నల్లబల్లపైనున్న కీలకపదాల ఆధారంగా శతక పద్యాలవల్ల సమాజానికి ఏం మేలు కలుగుతుందో చెప్పించాలి?

**సమాధానం :**

శతక పద్యాలు నైతిక విలువలను పెంపొందిస్తాయి. సమాజంలో వ్యక్తులు ఏం చేయాలో? ఏం చేయకూడదో తెలియజేస్తాయి. శతక పద్యాలు నేర్చుకోవడం ద్వారా ధారణాశక్తి పెరుగుతుంది. వీటి ద్వారా రసానుభూతిని, ఆనందాన్ని పొందుతారు. ఇవి ఇతరుల ధనంపై ఆశపడకూడదని వివరిస్తాయి. స్త్రీలపట్ల సోదరభావం కల్గి ఉండాలని మార్గదర్శనం చేస్తాయి. కోపం మంచిదికాదని పద్యాలు బుద్ధి చెప్తాయి. ఇతరులకు మేలు చేయాలని చేసిన మేలును పదే పదే చెప్పకూడదని తెలియజేస్తాయి. తమ గురించి తాము గొప్పలు చెప్పుకోకూడదని సందేశమిస్తాయి. తప్పుచేస్తే, చేసిన తప్పును ఒప్పుకోవాలనీ, మానవసేవే మాధవసేవనీ ఇలా ఇలా ఎన్నెన్నో నీతివాక్యాలు శతక కవులు తమ పద్యాల ద్వారా ప్రభోదించి ప్రజలను ఉత్తములుగా తీర్చిదిద్దుతారు.

SCERT TELANGANA

# 5. సృజనాత్మకత

**- శ్రీ పల్లెర్ల రామమోహన్‌రావు, శ్రీ కటుకోజ్వల మనోహరాచారి**

**పరిచయం :**

భావాలను అందంగా, ఆకర్షణీయంగా ఆవిష్కరించడమే సృజనాత్మకత. 'అభివ్యక్తి' ప్రధానంగా సాగుతుంది. ఆభావాలను వ్యక్తీకరించడం అందరిలో ఉన్నా సమాన స్థాయిలో ఉండదు.

**విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి ఉంటుందా? :**

సృజనాత్మకత అంటే ఏమిటో తెలియకపోయినప్పటికీ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి నిగూఢంగా ఉంటుంది. కొందరు కథలు చెప్పగలరు. కథను సంక్షిప్తీకరించగలరు. పాత్రల పేర్లు మార్చి చెప్పగలరు. కొందరు పేరడీలు పాడగలరు. ఏకపాత్రాభినయం చేయగలరు. ఇలా కొన్నింటిలో వారికి ప్రవేశముంటుంది.

**సృజనాత్మకతవల్ల ప్రయోజనమేమిటి? :**

ఇది మెదడుకు పదునుపెట్టే ప్రక్రియ. ఇందులో బాగా రాణించిన వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉండటం మనం చూస్తున్నదే. సృజనాత్మకత హృదయ స్పందనకు సంబంధించిన అంశం. ఈ రంగంలో కృషిచేస్తున్నవారు సున్నిత హృదయులుగా మలచబడతారు. మానవీయ విలువలతో వ్యవహరిస్తారు. సమాజానికి సరికొత్త ఆలోచనలకు, ప్రేరణను అందిస్తారు. సృజనాత్మకత, జీవనోపాధిగా మారిన సందర్భాలెన్ని ఉన్నాయి.

పరీక్ష దృష్టితో చూసినా ఈ అంశాన్ని సమర్థంగా రాసే వారికి మిగతా వారి కంటే మార్కులు పెరుగుతాయి. విద్యార్థి నైపుణ్యానికి ఇది గీటురాయిగా నిలుస్తుంది.

**సృజనాత్మకతలో విద్యార్థి ఎలా రాణించగలడు? :**

ఎందులోనైనా రాణించాలంటే నాలుగు విషయాలు ప్రధానమైనవి. అవి "అవసరం, అవకాశం, ప్రోత్సాహం, అభ్యాసం" ఏదైనా నేర్చుకోవాలంటే ముందుగా దాని అవసరం ఉండాలి. కేవలం అవసరముందే సరిపోదు దానిని నేర్చుకొనే అవకాశం ఉండాలి. అవకాశం ఉన్నా తగిన ప్రోత్సాహం లేకుంటే నీరుగారిపోతాడు. ఈ మూడూ సమకూరినప్పుడు సరిపడినంత అభ్యాసం చేస్తే రాణించగలడు.

ఒకనాడు సృజనాత్మక అంశాలను ఏ కొద్దిమంది విద్యార్థులో చేయగలిగితే వారిని గుర్తించి, ప్రత్యేకంగా ప్రోత్సహించేవారు. కాని ఈనాడు సృజనాత్మకత పాఠ్యపుస్తకాలలో అంతర్భాగమైంది. అనేక ప్రక్రియలను పరిచయం చేయడం జరిగింది. ఫలితంగా ఈ విభాగంలో రచనలు చేస్తున్న విద్యార్థుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ఇదొక శుభపరిణామం. దీనిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరముంది.

6 నుండి 10 తరగతుల వరకు పరిచయం చేసిన సృజనాత్మక ప్రక్రియలు

1) గేయం 2) కథ 3) సంభాషణ 4) వ్యాసం 5) లేఖ 6) కవిత 7) ఏకపాత్ర 8) ఆత్మకథ 9) పోస్టర్ 10) నినాదాలు 11) సూక్తులు 12) వర్ణన 13) ప్రశ్నావళి 14) ప్రకటన 15) ఆహ్వానపత్రం 16) అభినందనపత్రం 17) అభినందన వ్యాసం 18) ప్రసంగ వ్యాసం 19) స్వగతం 20) సంపాదకీయవ్యాసం 21) పుస్తక పరిచయం (పీఠిక) 22) కరపత్రం 23) యాత్రాచరిత్ర.

SCERT TELANGANA

**ఆశించే అభ్యసన ఫలితాలు :**

- పిల్లలు ఒక ప్రక్రియలో ఉన్న పాఠ్యాంశాన్ని మరో ప్రక్రియలోకి మార్చగలిగే నైపుణ్యాన్ని పెంపొందించగలగడం.
- చిన్న చిన్న కవితలు, గేయాలు రాయగలగడం.
- సూక్తులు, నినాదాలు సొంతంగా రాయగలగడం.
- సంభాషణలు కూర్చగలగడం.
- కరపత్రాలు, అభినందన పత్రాలు రాయగలగడం.
- పోస్టరు, ఆహ్వానపత్రాలు తయారుచేయగలగడం.
- ఇంటర్వ్యూ కోసం సొంతంగా ప్రశ్నలు తయారుచేసుకోగలగడం.
- ఏకపాత్రాభినయం కోసం తగిన మాటలు రాయగలగడం.

వీటన్నిటితోపాటు పలు సృజనాత్మక ప్రక్రియల్ని నిత్యజీవితంలో వినియోగించుకోగలిగేలా విద్యార్థుల్ని తీర్చిదిద్దడం ఈ సామర్థ్యం ద్వారా ఆశిస్తున్న ఫలితం.

**సామర్థ్య సాధనలో ఎదురవుతున్న సమస్యలు :**

తరగతి స్థాయిననుసరించి సృజనాత్మక అంశాలు చేర్చగలిగినా విద్యార్థులు సాధించడంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- కవితలు, గేయాలు వంటి ప్రక్రియలు సొంతంగా రాయగలమనే నమ్మకం లేకపోవడం.
- సొంతంగా ప్రయత్నించకపోవడం.
- గైడ్లలో సమాధానాలు దొరకడంవల్ల విద్యార్థులు సొంతంగా ఆలోచించే శ్రమ తీసుకోకపోవడం.
- రాత సమస్యలు, లేఖన దోషాలవల్ల కూడా రాయడానికి ఇష్టపడకపోవడం.
- వివిధ సృజనాత్మక ప్రక్రియల మీద పూర్తి అవగాహన కలిగియుండకపోవడం.
- సృజనాత్మక ప్రక్రియను ఎట్లా సాధించాలో తరగతి గదిలో సరిగా గ్రహించకపోవడం.
- ఇతర విద్యార్థుల నుండి వచ్చే విభిన్న రూపాలను స్వాగతించి ప్రోత్సహించకపోవడం.

**సామర్థ్యాల సాధనకై అనుసరించే వ్యూహాలు :**

సృజనాత్మక సామర్థ్యంలోని పలు ప్రక్రియలను సాధించేందుకు సాధారణంగా నిర్వహించే వ్యూహాలు క్రింది విధంగా ఉండాలి. అయితే వేర్వేరు ప్రక్రియలకు అవగాహన కల్పించడం, మాదిరి ప్రదర్శించడం వేర్వేరుగా ఉంటాయని గ్రహించాలి.

- ప్రక్రియను నల్లబల్లపై రాయడం.
- ప్రక్రియపై అవగాహన కల్పించడం.
- మాదిరి ప్రదర్శించడం.
- జట్లుగా చర్చింపజేయడం.
- వ్యక్తిగతంగా రాయించడం.
- ప్రదర్శింపజేయడం.
- దోషసవరణ చేయడం.



SCERT TELANGANA

**ఉదాహరణ :**

**కవిత (పిల్లలు రాసింది)**

**అంశం - వర్షం :**

ఆకాశంలో మబ్బులో కమ్ముకున్నాయి
ఉరుములు ఉరుముతున్నాయి
మెరుపులు మెరుస్తున్నాయి
పిడుగులు రాలుతున్నాయి
వర్షం వస్తుందా అనిపిస్తుంది
వర్షం వచ్చేసింది!
వాగులైంది...
వంకలైంది...
పొంగింది...
పారింది...
గంగలో కలిసింది...

**గేయం**

**అంశం - వర్షం :**

పల్లవి : కురుస్తుంది కురుస్తుంది
వాన భలే కురుస్తుంది
మెరుస్తుంది మెరుస్తుంది
మెరుపు భలే మెరుస్తుంది... ॥ కురుస్తుంది ॥
చెట్టు మీద కురుస్తుంది
గుట్ట మీద కురుస్తుంది
పిట్ట మీద కురుస్తుంది
గట్టు మీద కురుస్తుంది... ॥ కురుస్తుంది ॥

ఈ గేయాన్ని ఇంకా పొడిగించి రాసేలా పిల్లలకు తగిన సూచనలు, ప్రోత్సాహాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

SCERT TELANGANA

## ఏకపాత్రాభినయం : కాకి

### కాకి (పిల్లలు రాసింది)

పిల్లలూ...! నేను కాకినైనా మీ అందరి క్షేమాన్ని కోరుకునేదాన్ని. మీరంతా ఆకారానికి విలువిస్తారుగాని రూపురేఖలకన్నా గుణం గొప్పదని నా భావన. అయినా నేను మీకు మరీ అంత అందవికారంగా కనిపిస్తానా? నల్లగా ఉంటే అందంగా ఉండదా? అసలు మనుషుల్లో కూడా నల్లగా ఉన్నవారు అందంగా లేరా? అంతెందుకు... మీరు పూజించే విష్ణుమూర్తి నల్లనివాడే కదా!

అయినా మంచి చేసేవాళ్ళను గుర్తించకపోవడం మీ మనుషులకు అలవాటేకదా! అసలు నేను ఎంత మేలు చేస్తానో మీరు గమనిస్తేకదా! నా అరుపులో కరుకుదనం ఉందని చీదరించుకుంటారేమోగానీ, మీరు కూడా అప్పుడప్పుడు ఎంత కరుగ్గా మాట్లాడతారో, ఎందర్ని నొప్పిస్తారో పరిశీలించుకున్నారా? ఇకనుండైనా రూపానికి కాకుండా వ్యక్తిత్వానికి విలువిచ్చే గుణాల్ని మీ మనుషులంతా అలవరుచుకోవాలని మీ స్నేహితురాలిగా నా కోరిక...

### యాత్రా చరిత్ర (పిల్లలు రాసింది)

మేమంతా నేడు బాబా గుట్టకు ఉదయం 11 గం॥లకు బయలుదేరితిమి. నడుచుకుంటూ వెళ్తుంటే ఒక వ్యాను వచ్చింది. అది ఎక్కి మేము బాబా గుట్టకు వెళ్లాము. మేము బాబాకు కావాల్సిన పూలు, పండ్లు, ఊదుబత్తీలు కొన్నాం. దాని ఖరీదు రూ. 20/- అయింది. మేము మెట్ల దగ్గరికి వెళ్లాం. దాదాపు 450 మెట్లు ఉన్నాయి. మేము ఎక్కడం మొదలు పెట్టాం.

ఇక్కడ బాబా గుడికి ముస్లింలు ఎక్కువగా వస్తారు. వాళ్ల కష్ట సుఖాలు బాబా దగ్గర చెప్పుకుంటారు మెట్లు ఎక్కుతుంటే పైకి ఎక్కలేని పిల్లల్ని వాళ్ల తల్లిదండ్రులు ఎత్తుకుంటారు. ఈ బాబా గుట్ట దగ్గర భక్తుల్ని నెమలి ఈకల కట్టతోటి కొడుతుంటారు.

అలా చేస్తే మన కష్టాలు పారిపోతాయని అక్కడ ఒకాయన చెప్పారు. మేము దర్శనం చేసుకొని తిరిగి వస్తుంటే గుడి మెట్లకింద కాళ్లు చేతులు లేనివారు, గుడ్డివారు కనిపించారు. వాళ్లను చూస్తే బాధ అనిపించింది. అందరికీ ఒక్కొక్క రూపాయి దానం చేశాము. వాళ్లు మమ్మల్ని దీవించారు. బొంగులు, పుట్నాలు కొనుక్కొని సాయంత్రానికి ఇంటికొచ్చాం.

ఇవన్నీ మాదిరి కొరకు ఇవ్వబడినవి. ఇట్లే మిగతా సృజనాత్మక ప్రక్రియలన్నింటికీ వాటి లక్షణాలను స్పష్టంగా తెలియపరిచి రాయడానికి ప్రోత్సహించాలి.



SCERT TELANGANA

# 6. పదజాల సామర్థ్యం

- కె. రంగరాజు

**పరిచయం :**

ఆలోచనకు అభివ్యక్తికి సాధనం భాష. ఆ భాషకు పరిపుష్టిని కలిగించేది ఆ భాషలోని పదజాలం. ప్రతిభాషకు తనదైన ప్రత్యేక పదజాలము ఉంటుంది. సందర్భోచితమైన సమర్థవంతమైన పదప్రయోగ నైపుణ్యము వక్త లేదా రచయిత యొక్క ఆలోచనా పరిణతికి, వ్యవహారకుశలతకు, వ్యక్తీకరణ సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.

## పదజాల సామర్థ్యమంటే?...

ఒక పదము యొక్క అర్థము తెలుసుకున్నంత మాత్రాన అది పదజాల సామర్థ్యం అనిపించుకుంటుందా! ఉదాహరణకు "దేవుడు ఒక్కడే. మనుషులంతా ఒక్కటే", ఈ రెండు వాక్యాల్లోనూ ప్రయోగించిన 'ఒక్కటి' శబ్దము ఒకటే. రెండింటికీ అర్థపరంగా చూస్తే 'ఒకటి' అని అర్థం వస్తుంది. కాని వాటిలోని భావన వేరు. 'ఒక్క' శబ్దంలోని లోతైన భావనను అర్థం చేసుకోగలగాలి. అర్థం చేసుకోవడమేకాదు, అవసరమైనచోట సందర్భోచితంగా దానిని ప్రయోగించగలగాలి. వివరించగలగాలి. విస్తరించగలగాలి. విభిన్న సందర్భాల్లో ఉపయోగించగలగాలి. ఇవన్నీ చేయగలిగితే పదజాల సామర్థ్యం సాధింపబడినట్టు.

పిల్లలు ఇవన్నీ చేయలేకపోతున్నారా! అంటే... కొంతవరకు మాత్రమే చేయగలుగుతున్నారు. ఎందుకంటే భాషలో రకరకాల పదజాలం మనకు కనిపిస్తుంది.

దృశ్య సంబంధమైనవి, చేష్టలకు సంబంధించినవి, అమూర్తమైనవి.

- చూపు ద్వారా గుర్తించే వస్తువులకు సంబంధించిన పదజాలం.

  ఉదా॥ బల్ల, పుస్తకం, చెట్టు, కట్టె మొ॥నవి.

- చేష్టల ద్వారా గుర్తించే పదజాలం.

  ఉదా॥ తింటున్నారు, పడుకున్నారు, నడిచాడు మొ॥నవి.

- అమూర్తమైన / పదజాలం

  ఉదా॥ మంచివాడు, సమానులు, క్రూరమైనవి.

ఇందులో మొదటి రెండు విభాగాలకు చెందిన పదజాలాన్ని విద్యార్థులు నిత్య జీవితంలో వివిధ సంఘటనల్లో, సందర్భాల్లో, అప్రయత్నంగా తెలుసుకుంటున్నారు. అవసరమైన సందర్భాల్లో ప్రయోగించగలుగుతున్నారు కూడా. కాని అమూర్తమైన పదజాలాన్ని వినియోగించడంలోనే వెనుకబాటుతనం ఉంటున్నది. ఈ విషయంలో సామర్థ్యాన్ని పెంపొందించడంలోనే ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైంది.

ముఖ్యంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులు పదజాలంలో కింది అభ్యసన ఫలితాలను సాధించగలగాలి.

**ఆశించే అభ్యసన ఫలితాలు :**

- నూతన పదాలకు అర్థాలను తెలుసుకొని, ఆ నూతన పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించగలగాలి.
- ధ్వన్యనుకరణ పదాలను గుర్తించి ప్రయోగించగలగాలి.
- వ్యతిరేక పదాలను గుర్తించి ప్రయోగించగలగాలి.
- చదివిన / విన్న అంశంలోని కీలక పదాల భావనను అర్థం చేసుకొని సందర్భోచితంగా వినియోగించగలగాలి.



SCERT TELANGANA

- ప్రకృతి వికృతులను గుర్తించగలగాలి. వాక్యాల్లో ప్రయోగించగలగాలి.
- జాతీయాలను గుర్తించగలగాలి. వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించగలగాలి.
- సామెతలను గుర్తించగలగాలి. వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించగలగాలి.
- వ్యవసాయం, నృత్యం, సంగీతం, హస్తకళ... మొదలైన వృత్తిసంబంధమైన పదజాలాన్ని అర్థం చేసుకోగలగాలి. అవసరమైన సందర్భాల్లో వాటిని ప్రయోగించగలగాలి.
- పర్యాయపదాలను (సమానార్థక పదాలను) గుర్తించగలగాలి. వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించగలగాలి.
- నానార్థాలను గుర్తించగలగాలి. వాటిని సొంతవాక్యాల్లో ప్రయోగించగలగాలి.
- గళ్ళనుడికట్టు, భావనాచిత్రం మొదలైన భాషాక్రీడలను ఉత్సాహంతో నిర్వహించగలగాలి.
- అవసరమైనచోట్ల పదాల ఉత్పత్తికి (వ్యుత్పత్త్యర్థం) మూలం గుర్తించగలగాలి (ఉదా: జలజం)
- పై అన్ని సందర్భాల్లో అవసరమైన చోట్ల తోటి విద్యార్థుల, లేదా ఇతర పఠనసామగ్రి లేదా నిఘంటువు లేదా ఉపాధ్యాయుల సహకారం తీసుకోగలగాలి.

**సామర్థ్య సాధనలో ఎదురవుతున్న సమస్యలు :**

- నూతన / కఠిన పదాలకు అర్థాలను చెప్పలేకపోవడం.
- అర్థాలు తెలిసినా సొంతవాక్యాల్లో ప్రయోగించలేకపోవడం.
- కీలక పదాల యొక్క భావనను గుర్తించలేకపోవడం.
- జాతీయాలను / సామెతలను సొంతవాక్యాల్లో ప్రయోగించలేకపోవడం.
- జాతీయాల, సామెతల ప్రయోగానికి తగిన సందర్భాన్ని గుర్తించలేకపోవడం.
- వ్యవసాయం, నృత్యం, సంగీతం, హస్తకళ..... మొదలైన వృత్తిసంబంధమైన పదజాలాన్ని అవసరమైన సందర్భాల్లో ప్రయోగించలేకపోవడం.
- నానార్థాలను, పర్యాయపదాలను గుర్తించలేకపోవడం. వివిధ సందర్భాల్లో ప్రయోగించలేకపోవడం.
- పదాలకు ఉత్పత్తిని గుర్తించలేకపోవడం.
- గళ్ళనుడికట్టు, భావనాచిత్రం మొదలైన భాషాక్రీడలను నిర్వహించలేకపోవడం.

**సమస్యలకు కారణాలు :**

- కఠిన లేదా నూతన పదాలకు అర్థాలను తెలుసుకునే విషయంలో విద్యార్థులు నిరాసక్తత ప్రదర్శించడం.
- తగినన్ని నిఘంటువులు అందుబాటులో లేకపోవడం.
- పాఠ్యపుస్తకేతర కృత్యాలు అనగా వార్తాపత్రికలు చదవడానికి, టీవీల్లో వార్తలు చూడటానికి ఆసక్తి చూపకపోవడం.
- జాతీయమంటే ఏమిటో విద్యార్థులకు అర్థం కాకపోవడం.
- జాతీయానికి, సామెతకు తేడా తెలియకపోవడం.
- వ్యవసాయం, నృత్యం, సంగీతం, హస్తకళ, ..... మొదలైన వృత్తిసంబంధమైన పదజాలాన్ని తరచుగా వినకపోవడం.
- ఉపాధ్యాయుల నుండి అవసరమైన సమాచారాన్ని తెలుసుకునే విషయంలో బిడియం, భయం ఉండడం.
- కీలక పదాల భావనలను అర్థం చేసుకోలేకపోవడం, వాటిని వదిలివేయడం.

SCERT TELANGANA

- ఉపన్యాస, వ్యాసరచన పోటీలు తరచుగా నిర్వహించకపోవడం, వాటిలో అందరూ పాల్గొనకపోవడం.
- గళ్ళనుడికట్టు, భావనాచిత్రం మొదలైన భాషాక్రీడలు ఎక్కువగా అందుబాటులో లేకపోవడం, ఉన్నా వాటిని పూరించడంలో ఉత్సాహం చూపకపోవడం.
- కేవలం పరీక్షల (Exam) దృష్టితో మాత్రమే చూడడం.
- ముఖ్యంగా విస్తారంగా శ్రవణ, పఠన అవసరాలను కల్పించకపోవడం. అందుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేకపోవడం.

**సామర్థ్య సాధనకై వ్యూహాలు :**

- పదజాలాభివృద్ధి కలిగే ప్రయోజనాన్ని విద్యార్థులకు వివరించాలి. గొప్ప వక్తలు ఎలా తయారవుతారో వివరించాలి.
- రచయితలకు / కవులకు పదజాలంవల్ల కలిగే ప్రయోజనమేమిటో కూలంకషంగా వివరించాలి.
- దృశ్యమాధ్యమాల్లో పదజాలాభివృద్ధి కలిగే కార్యక్రమాలను చూసేట్టుగా ప్రోత్సహించాలి.
- ప్రతి పాఠాన్ని పిల్లలతో చదివించాలి.
- పాఠంలోని కఠిన పదాలను వాళ్ళే గుర్తించాలి.
- వాటికి అర్థాలను పిల్లలే స్వయంగా సేకరించాలి. అందుకోసం పదకోశం తప్పకుండా చూసేట్లు చూడాలి.
- నిఘంటువులను విరివిగా వాడేట్లు చూడాలి. అందుకోసం తగినన్ని నిఘంటువులను అందుబాటులో ఉంచాలి.
- అర్థాలు తెలుసుకున్న నూతన పదాలతో సొంతవాక్యాలు తయారుచేసేట్లు ప్రోత్సహించాలి.
- పర్యాయపదాలు, నానార్థాల విషయంలో కూడా ఎక్కువ అభ్యాసం చేసేట్లు చూడాలి.
- జాతీయాల గురించి తరచుగా విద్యార్థులకు వివరించాలి. వాటిని వాడుతూ మాట్లాడేటట్లుగా ప్రోత్సహించాలి.
- సామెతల గురించి విద్యార్థులతో తరచుగా చర్చించాలి.
- సమాజంలోని వ్యక్తులు మాట్లాడుకునేటప్పుడు జాగ్రత్తగా విని వాళ్ళ మాటల్లో వచ్చిన జాతీయాలను సామెతలను గుర్తించమనాలి.
- వక్తృత్వ పోటీలు పెట్టాలి.
- వివిధ వృత్తులకు సంబంధించిన పదజాలాన్ని సేకరించేట్లు ప్రాజెక్టులు ఇవ్వాలి.
- ఒకే అంశంపై వివిధ పత్రికల్లో రాయబడిన అంశాన్ని చదివించి వాటిలోని తేడాలను, పదజాలంలోని విశేషాలను గుర్తించమనాలి.
- పుస్తకపఠనాన్ని తప్పనిసరి అలవాటుగా మార్చాలి. అవసరమైన సామగ్రి అందుబాటులో ఉంచాలి.
- చిన్న చిన్న కవితలు, కథలు రాసేట్టుగా ప్రోత్సహించాలి. అట్లా రాసే సందర్భాల్లో జాతీయాలను, సామెతలను, ధ్వన్యనుకరణ పదాలను వాడుమని చెప్పాలి.
- తరచుగా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ ఉండాలి.
- గళ్ళనుడికట్టు వంటివాటిని పూరించడంలో మెళకువలు తెలియజెప్పి దానివల్ల కలిగే జ్ఞానాన్ని విశదపరచాలి.
- ఉపాధ్యాయులతో బిడియం లేకుండా మాట్లాడేటట్లు చూడాలి.
- 'పదజాలాభివృద్ధి' అనేది పరీక్ష కోసం అని కాకుండా నిత్యజీవితంలో దాని యొక్క అవసరాన్ని పిల్లలకు తెలియజెప్పాలి.



SCERT TELANGANA

# 7. భాషాంశాలు (వ్యాకరణాంశాలు)

- డా॥ మదత భాస్కర్, కె.కె.వెంకటశర్మ

**పరిచయం :**

భావ వినిమయ సాధనాలలో భాష ప్రధానమైనది. విద్యార్థి తన జ్ఞానార్జన కాలంలో తనకు తెలిసిన భాషలో రాయడం, చదువడం, మాట్లాడటానికి ఆసక్తి కనబరుస్తాడు. వివిధ సందర్భాలలో వ్యాకరణ పరిధిలో మాట్లాడుతున్నా, రాస్తున్నా తాను అది వ్యాకరణ సూత్రాలకు లోబడి ఉందని గ్రహించలేడు. పాఠ్యాంశాలలోని భాష, దైనందిన జీవితంలోని భాషల మధ్య విద్యార్థికి వ్యాకరణం యొక్క సంబంధం అవగాహన కల్పించాలి. తాను మాట్లాడుతున్న, చదువుతున్న, రాస్తున్న విషయాలు ఏ వ్యాకరణ సూత్రాలకు లోబడి ఉంటున్నాయో విద్యార్థి అర్థం చేసుకున్నప్పుడు వ్యాకరణ బోధన పరమ లక్ష్యం నెరవేరినట్లే. భాష, వ్యాకరణం వేరు కాదనే విషయం విద్యార్థి అర్థం చేసుకోవాలి. రోడ్డుపై ప్రయాణం చేస్తున్నప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించిన విధంగా భాషాభ్యసనం కొనసాగుట కొరకు ఉపాధ్యాయుడు మార్గదర్శిగా వ్యవహరించినప్పుడు తరగతి గదిలో వ్యాకరణ బోధన సుసంపన్నం అవుతుంది. విద్యార్థి భాషపై అధికారం పెంచుకొని ప్రయోగాత్మకంగా వినియోగించుకుంటూ విద్యాభ్యాసం కొనసాగించినప్పుడు సఫలీకృతుడవుతాడు. పూర్వకాలపు గ్రాంథికం మొదలుకొని నేటి వ్యావహారికం వరకు భాషలో జరుగుతున్న మార్పులు తెలుసుకొని, అర్థం చేసుకోవడానికి, విద్యార్థి అభిరుచి మేరకు విస్తృత అధ్యయనం కొనసాగించడానికి వ్యాకరణం ఎంతగానో ఉపయోగపడుతుంది.

నేడు విద్యార్థులు వ్యాకరణం పట్ల నిరాసక్తతను కనబరచడం భాషా సామర్థ్యాల అవగాహనకు ఆటంకంగా మారుతున్నది. ఉపాధ్యాయుడు భాషాంశాలు, వ్యాకరణాంశాలపట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా నూతన పద్ధతులలో భాషాబోధన కొనసాగించినప్పుడు, వ్యాకరణం సులభ సాధ్యమైన అంశంగా ఫలవంతమవుతుంది.

**అభ్యసనలో ఆశించే ఫలితాలు :**

- వ్యాకరణాంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలి.
- వర్ణమాల, విభాగాలు, భాషాభాగాలు, విభక్తులు, సంధిపదాలు, సమాసపదాలు కలుపడం, విడదీయడం మొదలైన వాటిని చేయగలగాలి.
- విద్యార్థులు రాసేటప్పుడు పదాలను, వాక్యాలను, జాతీయాలను, సామెతలను, విరామచిహ్నాలను, కాలాలు, క్రియలు, విశేషణం మొదలైన వ్యాకరణాంశాలను ఉపయోగించగలగాలి.
- భాషాభాగాలు, విభక్తులు, సంధులు, సమాసాలు, క్రియాభేదాలు, వాక్యభేదాలు స్పష్టంగా గుర్తించగలగాలి.
- విద్యార్థి నిత్యజీవితంలో వ్యాకరణాన్ని / భాషాంశాలను ప్రయోగించగలగాలి.
- సంధి సూత్రాలను సొంతమాటల్లో రాయగలగాలి.
- సందర్భోచితంగా వాక్య ప్రయోగం చేయగలగాలి.
- అలంకారాలు, ఛందస్సు లక్షణాలను సమన్వయం చేస్తూ, అర్థవంతంగా సొంతమాటల్లో వివరించగలగాలి.

**భాషాంశాలు (వ్యాకరణాంశాలు) అధ్యయనంలో ఎదురవుతున్న సమస్యలు :**

- విద్యార్థికి వ్యాకరణం పట్ల తెలియని భయం ఏర్పడటం.
- ప్రస్తుతం భాషాధ్యయనంలో వ్యాకరణం అంతగా అవసరం లేదనే దురభిప్రాయం ఉండటం.
- సంధి సూత్రాలను బట్టీ విధానంలో నేర్చుకోవడం.



SCERT TELANGANA

- సంధి, సమాస పదాలకు మధ్య తేడాలను గుర్తించలేకపోవడం.
- పారిభాషిక పదాలు అర్థం చేసుకోలేకపోవడం.
- తెలుగు, సంస్కృత పదాల వ్యత్యాసం గుర్తించలేకపోవడం.
- వాక్యభేదాల అభ్యాసం తరగతి గదిలో జరగకపోవడం.
- ద్విగు, బహువ్రీహి సమాసాల మధ్య తేడాలు గుర్తించడంలో లోపం.
- గణ విభజనలో 'ర' కారం (రేఫ ౘ) వచ్చినప్పుడు గురు, లఘువుల గుర్తింపులో తడబాటు.

**భాషాంశాలు / వ్యాకరణాంశాలు అధ్యయనంలోని సమస్యలు అధిగమించడానికి వ్యూహాలు :**

- వ్యాకరణం బోధించేటప్పుడు తెలిసిన విషయాల నుండి తెలియని విషయాలవైపు విద్యార్థులను ఉద్యుక్తుల్ని చేయాలి.
- వ్యాకరణం అధ్యయనం చేయడం అనేది నిరంతరం ప్రక్రియగా కొనసాగాలి.
- పాఠ్యబోధనలో వ్యాకరణం అంతర్భాగమనే భావనతో బోధన కొనసాగాలి.
- శబ్ద ఉత్పత్తిని పరిచయం చెయ్యాలి.
- ఉపాధ్యాయుడు వ్యాకరణం బోధించడానికి ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- నిత్య జీవితంలో ఉండే ఉదాహరణలను విద్యార్థికి చెప్పడం ద్వారా, విద్యార్థి ఆ ఉదాహరణలను ఉపయోగించడం ద్వారా బోధన సులభంగా ఉండేలా చూసుకోవాలి.
- వీలయినన్ని ఎక్కువ ఉదాహరణలు ఉపయోగించేలా చూడాలి.
- ఏ తరగతిలో బోధించాల్సిన భాషాంశాలు / వ్యాకరణాంశాలు ఆ తరగతిలోనే పూర్తయ్యేలా చూసుకోవాలి.
- పద్యభాగాలను బోధించేటప్పుడు కవులు అనుసరించిన విధానం, ప్రత్యేకశైలి తెలియజేస్తూ కవులపై గౌరవం పెంచేలా ఉపాధ్యాయుడు కృషిచేయాలి.
- వ్యాకరణాంశ బోధనలో సంధి / సమాస సూత్రాలు ఉపయోగిస్తున్నప్పుడు పారిభాషిక పదాలకు ముందుగా అర్థం తెలియజెప్పాలి.
- పద్య / గద్య భాగాలను బోధిస్తున్నప్పుడు వెంటనే సంధి, సమాస పదములు వచ్చినప్పుడు విసంధి చేసి అప్పటికప్పుడు / నివృత్తి చేయాలి.
- ఏవి తెలుగు పదాలు, ఏవి సంస్కృత పదాలు అనే ప్రాథమిక అవగాహనను కలిగి ఉండాలి. మహా ప్రాణాక్షరాలు, ఊష్మాలు ('స' మినహా) ఋత్వంలో కూడినవి, సంయుక్తాక్షరాలు, అనునాసికాలతో కూడిన పదాలను సంస్కృత పదాలుగా వ్యవహరిస్తున్నాం. అవి మినహా తెలుగు పదాలు.
- సామాన్య, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలపై సాధనకు విద్యార్థి దైనందిన జీవితంలోని ఉదాహరణలను విద్యార్థి చెప్పేటట్లుగా ప్రోత్సహించాలి. ఇది తరగతి కృత్యంగా నిర్వహించాలి. నల్లబల్లను తప్పక వినియోగించాలి.
- ద్విగు, బహువ్రీహి సమాసాల మధ్య మౌలిక భేదాలను విద్యార్థికి అవగాహన కలిగించాలి.
- గురు, లఘువుల గుర్తింపులో విద్యార్థులు ముందుగా తమ పేర్లను, ఊరి పేర్లు, వస్తువుల పేర్లు మొదలగువాటి గణ విభజన చేయునట్లుగా ప్రోత్సహించాలి.
- శబ్ద, అర్థ అలంకారములను విద్యార్థుల దైనందిన జీవితంలోని ఉదాహరణలతో అనగా సినిమా పాటలు, గేయాలు, కవితలు, పద్యాలు, ప్రసిద్ధ వాక్యాలు చెబుతూ ఆసక్తి కలిగించాలి.

SCERT TELANGANA

# 1. మాదిరులు - ఉదాహరణలు

1) **సంధి నిర్ణయంలో** భాగంగా తెలుగు, సంస్కృత పదాల నిర్ణయంలో, విసర్గ (ః) ఉండే పదాలు, మహాప్రాణాలు అయిన ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ; అనునాసికాలైన - ఙ, ఞ, ణ; ఊష్మాలైన - శ, ష, హ తప్పనిసరిగా సంస్కృత భాషా పదాలలోనే వస్తాయి అని తెలుపవచ్చు. అలాగే ఎ, ఒ, ె, ొ - ఉండే పదాలు తెలుగు పదాలలోనే వస్తాయి అని తెలుపవచ్చు.

2) **సంధి పదాలు విడదీయడంలో** - విడదీసిన రెండు పదాలు అర్థవంతమైనవి అని చెప్పాలి. పదాలు రెండూ ఇకే భాషకు చెందినవైనప్పుడు ఆ భాషకు సంబంధించిన సంధి కార్యం చెప్పవచ్చు.

ఉదా॥ అ) దేవాలయం → దేవ + ఆలయం (సంస్కృత సంధి)

ఆ) చింతాకు → చింత + ఆకు (తెలుగు సంధి)

3) **ద్విగు - బహుప్రీహి సమాసాలు**

ద్విగు సమాసం మొదట పరిచయం అవడం మూలాన... తరువాత పరిచయం అయ్యే బహుప్రీహి సమాసంలో పూర్వ పదం 'సంఖ్యా వాచకం' అయినప్పుడు 'ద్విగు'గా పొరబడే అవకాశం ఎక్కువ. ఉదాహరణకు ఈ సమాస పదం గమనించండి.

చతుర్ముఖుడు 1 నాలుగు ముఖములు కలవాడు (ఎవరు? - బ్రహ్మ)

నాలుగు అనేది సంఖ్య అయినా - "నాలుగు ముఖములు" అని లేదు. కలవా"డు" ఎవ"డు"? - అని ఉన్నది. దీనికి జవాబు "బ్రహ్మ" తప్ప వేరు లేదు కాబట్టి దీనిని "బహుప్రీహి"గా నిర్ధారించాలి.

నాలుగు చేతులు, ఏడు కొండలు, మూడు చెరువులు - ఇటువంటి పదాలలోనివి 'సంఖ్యలు' మాత్రమే. వీటికి ప్రశ్నలు వేసుకున్నప్పుడు "ఎన్ని" అని మాత్రమే వేయగలం, కాబట్టి "ద్విగు" సమాస పదాలుగా నిర్ధారించాలి.

4) గురు లఘువుల విభజనలో 'రేఫ' (ర) కు ముందు అక్షరం ఊనికతో పలుకుతున్నప్పుడు 'గురువు' అవుతుంది.
ఉదా : చక్రము;

'రేఫ' 'ర' కారానికి ఊనికతో పలుక/బడ/ని అక్షరాలు లఘువులుగా గుర్తించాలి.

U I I U
ఉదా : భానుప్రకాశ్

'భానుప్‌రకాశ్' గా కాకుండా భానుప్‌రకాశ్ గా అంటాము. కాబట్టి 'ప్ర' అనే సంయుక్తాక్షరానికి ముందున్న 'ను' గురువుగా మారదు.



SCERT TELANGANA

# 8. నిర్మాణాత్మక మూల్యాంకనం - నిర్వహణ

*- స్తంభంకాడి గంగాధర్*

**ఉపోద్ఘాతం :**

పాఠశాలల్లో 6 నుండి 10 తరగతులకు నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరుగుతున్నది. విద్యార్థుల ప్రగతిని మూస పద్ధతితో కూడిన పరీక్షల ద్వారా మూల్యాంకనం చేయడం అశాస్త్రీయమని గుర్తించడంవల్ల సి.సి.ఇ.ని నిర్వహించడం జరుగుతున్నది. విద్యార్థులు ఎలా నేర్చుకుంటున్నారు? అభ్యసన ఫలితాలు ఎలా ఉంటున్నాయి? అనేవి గుర్తించడానికి నిర్మాణాత్మక మూల్యాంకనం, సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహిస్తున్నాం.

**నిర్మాణాత్మక మూల్యాంకనం :**

నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని 20 మార్కులకు నిర్వహిస్తారు. ఈ 20 మార్కులను కింది విధంగా కేటాయిస్తారు.

| | | | |
|---|---|---|---|
| 1) | పుస్తక పఠనం, సమీక్షారచన | : | 5 మార్కులు |
| 2) | విద్యార్థులు రాసిన అంశాలు | : | 5 మార్కులు |
| 3) | ప్రాజెక్టుపని | : | 5 మార్కులు |
| 4) | లఘు పరీక్ష | : | 5 మార్కులు |

పై 4 అంశాల గురించి వివరంగా పరిశీలిద్దాం.

**1) పుస్తక పఠనం - సమీక్ష :**

పుస్తక పఠనం అంటే విద్యార్థి తాను అభ్యసించే పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పాఠశాల గ్రంథాలయ పుస్తకాలు, బాల సాహిత్యం, ఇతర పుస్తకాలు చదువడం. విద్యార్థుల స్థాయికి అనుగుణమైన పుస్తకాలు పిల్లలు చదువాలి. కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కావడంవల్ల విద్యార్థులు అదనపు జ్ఞానాన్ని పొందలేకపోతున్నారు. పాఠ్యపుస్తక అభ్యసనం ద్వారా పొందిన భాషా జ్ఞానంతో బయటి పుస్తకాల్ని స్వయంగా అభ్యసించి అందులోని విషయాల్ని గ్రహించే స్థాయికి విద్యార్థి ఎదగాల్సిన అవసరం ఉంది.

**పుస్తక సమీక్ష :** పాఠ్యపుస్తకాల పఠనం ద్వారా విద్యార్థులందరిలోనూ దాదాపు ఒకే రకమైన వ్యక్తీకరణకు అవకాశం ఉంది. విద్యార్థులు ఇతర పుస్తకాలు చదివి, సమీక్ష రాయడం ద్వారా వారి స్వంత వ్యక్తీకరణ బయటపడుతుంది. ఆయా విద్యార్థులకు వేర్వేరు పుస్తకాలు అందించడంవల్ల, వాటిని చదివే విద్యార్థులు సమీక్షలు కూడ వేరు వేరుగా చేస్తారు. పుస్తక సమీక్షకు ప్రత్యేకంగా ఒక నోటుపుస్తకం ఏర్పాటుచేయించి, ఆయా సమీక్షల్ని అందరి చేత తరగతి గదిలో చదివించాలి. దీనికి అదనంగా కేటాయించబడే 3 పీరియళ్ళు వినియోగించుకోవాలి. వాటి సమీక్షా స్థాయిని బట్టి 5 మార్కుల వరకు FA లో నమోదు చేసుకోవాలి. పుస్తక సమీక్షకు కనీసం వారం రోజుల సమయాన్ని కేటాయించాలి.

పుస్తక సమీక్షలో I. ప్రాథమిక వివరాలు II. చదివిన అంశం III. అభిప్రాయం అనేవి ప్రధానాంశాలు. 'ప్రాథమిక వివరాల'పుస్తకం పేరు, రచయిత పేరు, ప్రక్రియ, ముద్రణాసంస్థ, పుటల సంఖ్య, వెల అనే అంశాలు రాయాలి. ఈ వివరాలను 6, 7 తరగతులలో బుల్లెట్ పాయింట్ల రూపంలో రాసినా, 8, 9, 10 తరగతుల్లో పేరా రూపంలో రాయాలి. 'చదివిన అంశం'లో పుస్తకంలో ఉన్న విషయాన్ని విశ్లేషించాలి. స్వంత మాటల్లో రాయాలి. పుస్తకంలోని పద్యాలు / కవితలు / సామెతలు / సూక్తులు మొదలైనవి విశ్లేషణలో ఉదహరించాలి.

SCERT TELANGANA

మూడవ అంశమైన 'అభిప్రాయాలను రాయడం' పుస్తక సమీక్షలో అతి ముఖ్యమైనది. పుస్తకం చదువడం ద్వారా తాను పొందిన అనుభూతినీ, అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలి.

సమీక్ష రచన అనగానే స్థాయికి మించినదిగా భావించాల్సిన అవసరం లేదు. పుస్తకం పెద్దదైనప్పుడు ప్రధానాంశాల్ని చదివి అందులోని మంచీ చెడుల్ని పరిచయం చేసేలా రాసినా సరిపోతుంది.

**2) రాత పనులు :**

విద్యార్థులు సొంతమాటల్లో రాయడం, సృజనాత్మకంగా రాయడం, భాషాంశాలకు సంబంధించిన అంశాలు రాయడం అనేవి రాతపనులు. పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశం తర్వాత 'ఇవి చేయండి' శీర్షిక కింద ఇచ్చిన సామర్థ్యాల సాధనకు సంబంధించినవి రాత అంశాలు. ప్రత్యేకంగా ఒక నోటు పుస్తకం రాత అంశాల కొరకు ఉండాలి. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించడం ద్వారా ఈ రాత అంశాల స్థాయిని గుర్తించవచ్చు. పాఠ్య పుస్తకంలోని అభ్యాసాలను విద్యార్థి నోటు పుస్తకంలో రాస్తాడు. ఇందులో స్వీయరచన, సృజనాత్మకతకు చెందిన ప్రశ్నలకు స్వయంగా జవాబులు రాస్తాడు. అలా రాసిన అంశాల్లోని రచనా శైలి, స్వీయభావనలు, భాష, వాక్య నిర్మాణ రూపము తదితరాలన్నీ ప్రాధాన్యతవహిస్తాయి. విద్యార్థి స్వంత వ్యక్తీకరణకు రాత అంశాలలో ప్రాధాన్యత ఇవ్వాలి.

**నిర్వహణ :** బోధనా సోపానాల్లో అభ్యాసాల నిర్వహణకు తగిన కాలాంశాలు కేటాయించడం జరిగింది. వాటిని సరిగా వినియోగించుకొని విద్యార్థులు రాత అంశాలు పూర్తి చేసే విధంగా చూడాలి. తరగతి గదిలో రాయాల్సిన అభ్యాసాలు ఆయా పీరియడ్లలోనే పూర్తి చేసే విధంగా చూడాలి. ఇంట్లో రాయల్సిన అంశాలను ఇంటిపనిగా ఇవ్వాలి.

**మార్కుల కేటాయింపు :** విద్యార్థి స్వయంగా రాసిన అంశాలకు 5 మార్కులు కేటాయించాలి. విద్యార్థి గైడ్‌లు, వర్క్ బుక్‌లు చూసి రాస్తే వాటిని పరిగణనలోకి తీసుకోకూడదు. అవసరమైతే స్వంతంగా మళ్ళీ రాసేలా చూడాలి. సౌలభ్యం కోసం ఒక్కొక్క పాఠానికి 10 మార్కుల చొప్పున కేటాయించుకోవాలి. FA నిర్వహించే సమయానికి ఎన్ని పాఠాలు పూర్తయితే వాటి సగటు లెక్కించాలి. నమోదు చేసేటప్పుడు 5 మార్కులకు లెక్కించాలి. వ్యక్తీకరణ, భావాన్ని క్రమ పద్ధతిలో రాయడం, దోషాల్లేకుండా రాయడం, సొంతంగా రాయడం మొదలైన అంశాలను మార్కులు కేటాయించడానికి పరిగణనలోనికి తీసుకోవాలి. విద్యార్థులు ఒకరికొకరు చూసి రాయకుండా జాగ్రత్తవహించాలి. ప్రతి పాఠానికి మార్కులు కేటాయించాలి. నోటు పుస్తకాలు పరిశీలించకుండా మార్కులు ఇవ్వరాదు.

**3) ప్రాజెక్టు పని :**

వివిధ వనరుల ద్వారా సమాచారన్ని సేకరించి నివేదిక రాసి, ప్రదర్శించడాన్ని భాషా ప్రాజెక్టు పనులుగా పరిగణిస్తారు. దీనివల్ల అభ్యసించిన సామర్థ్యాలను వినియోగించగలుగుతారు. ప్రాజెక్టుపని విభిన్న సామర్థ్యాలు, కృత్యాల సమాహారం. విద్యార్థిలోని సమగ్ర అంతర్గత శక్తుల్ని వెలికితీయడం, వాటిని పెంపొందించడం, వినియోగింపజేయడమే ఈ ప్రాజెక్టు పనుల ఉద్దేశ్యం.

పాఠ్య పుస్తకంలో ప్రతి పాఠం చివర భాషా కార్యకలాపాలు / ప్రాజెక్టుపని పేరుతో అన్ని పాఠాలలో ఈ అంశాన్ని చేర్చడం జరిగింది. FA నాటికి ఎన్ని పాఠాలు పూర్తయినా, వాటిలో ఏదైనా ఒక ప్రాజెక్టు పనిని విద్యార్థులను చేయమనాలి. నివేదిక రాయమనాలి. ప్రాజెక్టును ఎలా చేయాలో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలి. పాఠ్యాంశ బోధన తర్వాత ప్రాజెక్టుపనిని అప్పగించి, అభ్యాసాల నిర్వహణ అనంతరం విద్యార్థుల చేత వారి వారి ప్రాజెక్టులను ప్రదర్శింపజేయాలి.

**మార్కుల కేటాయింపు :** FA లో ప్రాజెక్టు పనులకు 5 మార్కులు కేటాయించడం జరిగింది. అయితే దీన్ని 10 మార్కులకు నిర్వహించుకొని సగటున 5 మార్కులు నమోదు చేసుకోవచ్చు. సమాచార సేకరణ నైపుణ్యానికి 2 మార్కులు, నమోదు చేసే విధానానికి 5 మార్కులు, ప్రదర్శనా వివరణకు 3 మార్కుల చొప్పున ఇవ్వవచ్చు.

**నివేదిక :** (అ) ప్రాథమిక సమాచారం

1) ప్రాజెక్టు పని పేరు :

2) సమాచారాన్ని సేకరించిన విధానం :

(ఆ) విషయ వివరణ ( సేకరించిన సమాచారాన్ని పేరా లేదా పట్టిక రూపంలో సంక్షిప్తంగా రాయాలి.)

(ఇ) నేర్చుకున్న విషయాలు-ముగింపు

ప్రాజెక్టు పని గ్రూపుల వారీగా చేసినా, నివేదిక వ్యక్తిగతంగా రాయాలి. మార్కులను వ్యక్తిగతంగా కేటాయించాలి.

**4) లఘు పరీక్ష :**

తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలకు అనుగుణంగా సామర్థ్యాలను అంచనా వేయడానికి తగిన ప్రశ్నలను కూర్చి విద్యార్థులచే సమాధానాలు రాయించాలి. ఒక FA నాటికి 1 నుండి 3 లఘు పరీక్షలు నిర్వహించుకున్నా వాటిలో ఉత్తమంగా మార్కులు పొందిన పఘు పరీక్షను నమోదు కొరకు తీసుకోవాలి. ఒక లఘు పరీక్షను 20 మార్కుల చొప్పున నిర్వహించాలి. తర్వాత సగటును 5 మార్కులకు తీసుకోవాలి.

I, II FA ల సరాసరి SA-I కు,

I, II, III, IV ల సరాసరి SA-II కు స్వీకరించాలి.

పిల్లలు జవాబులను నోటు పుస్తకాలలో రాయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠ్య పుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలను యథాతథంగా ఇవ్వరాదు. లఘుపరీక్షను 10 మార్కుల చొప్పున రెండు సార్లు నిర్వహించకూడదు. ఒకేసారి 20 మార్కులకు నిర్వహించాలి. ఏవైనా 2, 3 సామర్థ్యాల ఆధారంగా నిర్వహించాలి. అయితే తప్పనిసరిగా స్వీయరచన, సృజనాత్మకత ప్రశ్నలను ఇవ్వాలి.

***

SCERT TELANGANA

# ఉపాధ్యాయ మిత్రులూ...

- పూదత్తు కృష్ణమోహన్

| | | | |
|---|---|---|---|
| పల్లవి | : | (ఉపాధ్యాయ మిత్రులూ... వెలుగు పంచుదివ్వెలూ... | |
| | | విజ్ఞానం పంచిపెట్టు - ధీరపుణ్య చరితులూ...) 2 | |
| చరణం-1 | : | అపురూపమైన బాల్యానికి - ఆకృతినీ కల్పించీ | |
| | | మట్టి ముద్దలన్నిటినీ మూర్తులుగా మలచునట్టి | ॥ఉ॥ |
| చరణం-2 | : | ఆటలతో పాటలతో - అందమైన మాటలతో | |
| | | అవగాహన కలిగించే అనేక కృత్యాలతో... | ॥ఉ॥ |
| చరణం-3 | : | క్రమశిక్షణ నేర్పిస్తూ - విలువల వికసింపజేస్తే | |
| | | బాలలలనూ అందరికీ - ఉత్తమ పౌరులుగ మార్చు | ॥ఉ॥ |
| చరణం-4 | : | చిరునవ్వులు చిందిస్తూ - ఉత్తేజం కలిగిస్తూ | |
| | | లక్ష్యాలను సాధిస్తూ - ప్రవర్తనను మార్చేస్తూ | ॥ఉ॥ |
| చరణం-5 | : | డాక్టరైన యాక్టరైన - పొలిటికల్ లీడరైన | |
| | | అందరినీ తీర్చిదిద్దు - భావినిర్మాతలూ... | ॥ఉ॥ |

SCERT TELANGANA

# వాచకవైభవం

- కటుకోజ్వల మనోహరాచారి

పల్లవి : తెలంగాణ వెలుగులతో తేజరిల్లె వాచకాలు
గలంయెత్తి పాడుకునే జనజీవన గీతికలు
మన తెలుగుల మధురిమతో... జన పదముల జిలుగులతో...
మన సంస్కృతి మన సాహితి మన చరిత్ర వేదికలై... ॥ తెలంగాణ ॥

1) తెలుగంటే తెలంగాణ యాస బాస కాదా?
తేనెలొలుకు తెలుగు భాష తెలంగాణ కాదా...?
జనపదాన ఉద్భవించి పదపదాన విస్తరించి
జనం గళం జయగళమౌ తెలంగాణ జానపదం ॥ తెలంగాణ ॥

2) సమైఖ్యాన మరుగున పడిపోయిన మన చరిత్రలు
స్వరాష్ట్రాన వెలుగులోకి తేవడమొక సంకల్పం...
మన కవులు... మన ప్రముఖులు... మన భాషకు పట్టమొచ్చి
ఘన చరితను గన్నవి ఈ నవవసంత, సింగిడీలు... ॥ తెలంగాణ ॥

3) భాగవతము పండించిన పోతన వెలసిన క్షేత్రం
దేశీయత కురిపించిన పాల్కురికిది ఈ ప్రాంతం
అగ్నిదార రుద్రవీణ కురిపించిన ధాశరధీ...
కాళోజీ సినారెల కవన ఘనత మన చరిత... ॥ తెలంగాణ ॥

4) తెలంగాణ పద సంపద తెలంగాణ పలుకుబళ్లు...
తెలంగాణ సామెతలతొ వెలుగు నింపుకున్న భాష
తేనెవంటి తెలుగు భాష తెలంగాణ జనుల శ్వాస
కలగలిపిన కరదీపం... మన ఈ వాచక రూపం... ॥ తెలంగాణ ॥

SCERT TELANGANA

# రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణాసంస్థ, హైదరాబాదు

# పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ రాష్ట్రం

## - తప్పనిసరి బోధనాంశంగా తెలుగు అమలు -

తెలంగాణ సుందరమైన ప్రదేశం. భౌగోళికంగా సుసంపన్నమైన ప్రాంతం. నదులు, కొండలు, అడవులు, చెరువులు, వాగులు, నల్ల, ఎర్ర రేగడి భూములు, గనులు, ఖనిజాలతో విలసిల్లుతున్న ప్రాంతం. ఉత్తరాన గోదావరీ నది, దక్షిణాన కృష్ణానది, సహజ సరిహద్దులుగా నెలకొని ఉన్న ప్రాంతం. గోదావరినానుకొని దండకారణ్యం, కృష్ణనానుకొని నల్లమల్ల అడవులు సహజ సంపద నిలయాలుగా ఉన్నవి. భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, వనరులు ఉన్న ప్రదేశం కావటంవల్ల ఇక్కడ ఎన్నో జాతుల వాళ్ళు వేల సంవత్సరాలుగా నివసిస్తున్నారు. వీరిలో గోండులు ఒకరు. తాము మూలపురుషులుగా భావించి పూజించే వారిలోని 'తెలింగం'ను తెలుగు జాతి మూలపురుషుడని ఆరుద్ర భావించాడు. స్థానికంగా ప్రాచీనకాలం నుంచి 'తలైంగ్' జాతివారు నివసించారని, 'తలైంగ్'లు నివసించినందువల్లనే 'తిలింగ, తెలుంగు' పదాలు వచ్చాయని, వారు మాట్లాడే భాష 'తెలుగు' అని, ఆ జాతి 'తెలుగు' అని ఖండవల్లి సోదరులు భావించారు. మార్కండేయ, వాయు పురాణాల్లో 'తిలింగ' ప్రస్తావన ఉన్నది. గ్రీకు శాస్త్రజ్ఞుడు 'టాలెమి' తన యాత్రా చరిత్రలో 'టిలింగాన్' పదాన్ని పేర్కొన్నాడు. ఈ 'తిలింగ' శబ్దమే 'తెలుగు' శబ్దానికి మూలం. 'తెలుంగు', 'గణం' కలిసి తెలంగాణగా మారినట్లు భావించవచ్చు. మెదక్ జిల్లాలోని తెల్లాపూర్‌లో బయటపడిన క్రీ॥శ॥1417 నాటి శాసనంలో 'తెలంగాణ' పదం ప్రయోగించబడింది. అనంతర కాలంలో, వ్యవహారాల్లో 'తెలంగాణ' పదం విస్తృత ప్రచారంలోకి వచ్చింది. ఇక్కడి ప్రజల భాష తెలుగు. తెలుగు మాట్లాడే వారుండే ప్రాంతం కాబట్టే ఇది 'తెలంగాణ' అని అంటున్నారు.

భాష కేవలం భావ వినిమయ సాధనం అనేది ప్రాథమిక భావన. భాష పరిధి చాలా విస్తృతమైంది. మన భౌతిక వాతావరణం, చరిత్ర, ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రత్యేకతలు, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వం, ఉజ్జ్వల స్మృతులు భాషలో నిక్షిప్తమై ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక జాతి ఆత్మ ఆ జాతి భాషలో ప్రతిబింబిస్తుంది.

తెలంగాణ ప్రజలు వ్యవహరించే తెలుగు విశేషమైంది. ఎన్నో ప్రత్యేకతలు కలిగి ఉన్నది. లయబద్ధంగా ఉండడంవల్ల, దృతాత్మకంగా ఉచ్చరించడంవల్ల వినసొంపుగా ఉంటుంది. జీవితానుభవాలలో వికసించిన సామెతలు, జాతీయాలు, పలుకుబడులు సహజంగానే ఇమిడి ఉండడంవల్ల అర్థవంతమై అలరిస్తున్నది. సహజత్వం, సరళత్వంతోపాటు సృజనాత్మకంగా సాగిపోతున్నది. భావాలను ప్రసన్నంగా వ్యక్తంచేసే పద్ధతివల్ల 'జాను తెనుగు' గా ప్రశంసలందుకున్నది. కమ్మని ధ్వనులకు, కమనీయ అలంకారాలకు నెలవైన భాష. జానపద గీతాలకైనా, పద్యకావ్యాలకైనా, అలవోకగా ఒదిగిపోయే అందమైన భాష. సంస్కృత, ఉర్దూ, పారశీ, అరబ్బి, ఆంగ్ల, హిందీ పదాలను కలుపుకొని పదవిస్తృతి సాధించి విశాలతత్వంతో కొత్త సొబగులను అద్దుకొని పురోగమిస్తున్న భాష.

ఎన్నో సాహితీ ప్రక్రియలకు పురుడుపోసుకున్న ప్రాంతం తెలంగాణ. తొలికందం, ద్విపద, సీసం, శతకం, దేశీపురాణం, అచ్చతెనుగు కావ్యం, యక్షగానం, పాట-గేయం వంటి సాహితీ ప్రక్రియలు తెలంగాణ కవుల కలాల నుండి జాలువారినవే! వేల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది కాబట్టే 'తెలుగు'కు ప్రాచీన హోదా గూడా లభించింది. భారతదేశంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో తెలుగు 4వ స్థానంలో ఉన్నది.



SCERT TELANGANA

తెలుగు ఇక్కడి వారికి మాతృభాష. ఇతరులకు తమ అవసరాలను తీర్చే ప్రాంతీయ భాష. తెలుగును అభ్యసించడం వ్యక్తిగత, సామాజిక అవసరం. ఎవరైనా తమ మాతృభాషలోనే ఆలోచిస్తారు. అతి సున్నిత భావాలనైన మాతృభాషలో వ్యక్తంచేసినంత ప్రభావవంతంగా ఇంకే భాషలోనూ చేయలేరు. ఏ మాధ్యమంలో చదువుతున్నప్పటికీ మాతృభాషలో అర్థం చేసుకొని, అవసరమైన సందర్భాలలో ఇతర భాషలోకి అనువదించుకొని వ్యక్తం చేస్తారు. తెలుగు మాతృభాషకానివారు తెలంగాణ రాష్ట్రంలో తెలుగు నేర్చుకోవడంవల్ల తమ దైనందిన వ్యవహారాలను సమర్థంగా నిర్వహించుకోగలుగుతారు. ఇక్కడి ప్రజలతో మమేకం కావడంలో, మానవ సంబంధాలు ఏర్పరచుకోవడంలో, తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకోవడం తెలుగేతరులకు ఒక సామాజిక అవసరం. అందుకే తమ మాతృభాషతో పాటు తెలుగును నేర్చుకోవడం వారికి అత్యవసరంగా మారింది. అట్లాగే ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకొనే సత్తా కూడా పిల్లలకుందని, ఎన్ని ఎక్కువ భాషలు నేర్చుకొంటే, అది వారి విజ్ఞాన పరిధిని అంత విస్తృతపరుస్తుందని, ఆయా భాషలపట్ల సున్నితత్త్వము, గౌరవభావం, సహనం, విశ్లేషణ, సృజనాత్మక వంటివి వ్యక్తుల్లో వృద్ధిచెందుతాయని భాషావేత్తలు పేర్కొన్నారు.

దురదృష్టవశాత్తు ఈ మధ్యకాలంలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య తగ్గుతున్నందని UNESCO, ప్రసారమాధ్యమాలు పేర్కొనడం గమనార్హం. ఆంగ్ల మాధ్యమాల మోజులో తెలుగు అభ్యసనం నిర్లక్ష్యానికి, న్యూనతకు లోనౌతున్నది. దీనివల్ల మన భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి. సంప్రదాయాలకు దూరమయ్యే ప్రమాదం వాటిల్లుతున్నది. ఈ పరిస్థితిని అధిగమించి 'తెలుగు'ను ప్రతి ఒక్కరూ అభ్యసించేలా చేయడం తక్షణావసరంగా మారింది.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరూ తప్పనిసరిగా తెలుగును ఒక సబ్జక్టుగా చదువాలని, దీనికి చట్టాన్ని రూపొందిస్తామని 2017 డిసెంబర్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభ, ముగింపు సమావేశాల్లో ప్రకటించి తన భాషాభిమానాన్ని చాటారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 213, తేది : 31-10-17 ద్వారా ఒక కమిటీని నియమించింది. కమిటీ సభ్యులు పంజాబ్, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలతోపాటు, సి.బి.యస్..ఇ., ఐ.సి.ఎస్.ఇ., కేంద్రీయ విద్యాలయాలు వంటి సంస్థలను సందర్శించి భాషా వినియోగం, వివిధ భాషల అభ్యసనం, అమలుతీరు తెన్నులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ నివేదికను పరిశీలించి, చర్చించి ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు, అన్ని మాధ్యమాలకు చెందిన పాఠశాలల్లో 'తెలుగు'ను తప్పనిసరి బోధనాంశంగా 2018-19 విద్యా సంవత్సరం నుండి అమలు చేయడానికి చట్టాన్ని రూపొందించాలని నిర్ణయం తీసుకొన్నారు. ఇందుకనుగుణంగా 2018 మార్చ్ మాసంలో జరిగిన శాసన సభ, శాసన మండలి సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టారు. తేది : 30-03-2018 రోజునాడు "Act No.10 of 2018" గా తెలంగాణ రాష్ట్రంలో తెలుగును బోధించడం, నేర్చుకోవడం తప్పనిసరి (Teaching and Learning Telugu Language At Compulsory in the State of Telangana) అనే పేరుతో చట్టం రూపొందింది.

చట్టంలోని అంశాలను అమలుపర్చుటకు అవసరమైన వివరణలు, విధివిధానాలు, వివిధ అంశాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఉత్తర్వు 15ను తేది : 01-06-2018 రోజునాడు విడుదల చేసింది. ఇందుకనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు, అన్ని మాధ్యమాలకు చెందిన పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును విధిగా నేర్పాలని, విద్యార్థులు నేర్చుకోవాలని తెలుపుతూ పాఠశాల విద్యాశాఖ, తేది : 29-06-2018 రోజున ఉత్తర్వులను జారీ చేసింది.



SCERT TELANGANA

పాఠశాలలో తప్పనిసరి బోధనాంశంగా తెలుగును బోధించడం, నేర్చుకోవడం గురించి రూపొందించిన చట్టం 10, తేది : 30-03-2018, ప్రభుత్వ ఉత్తర్వు 15, తేది : 01-06-2018లోని ముఖ్యాంశాలు.

- తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాలు అనగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుపొందిన ప్రైవేటు పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, సి.బి.యస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి. సంస్థలకు అనుబంధంగా నడిచే అన్ని రకాల పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును తప్పనిసరి బోధనాంశంగా అమలుపరుస్తారు.

- మన రాష్ట్రంలోని రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో తెలుగు ఇప్పటికే అమలులో ఉన్నది. ఐతే ఇతర మాధ్యమ పాఠశాలల్లో అనగా ఉర్దూ, హిందీ, కన్నడ, తమిళం, బెంగాలి, మరాఠీ మాధ్యమ పాఠశాలల్లో, సి.బి.యస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి.పాఠశాలల్లో కూడా తెలుగును నేర్పడాన్ని దశల వారీగా అమలుపరుస్తారు. అనగా ఇప్పటివరకు తెలుగును అమలుచేయని పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతితో ప్రాథమిక స్థాయిలో ప్రారంభించి సంవత్సరానికి ఒక తరగతి చొప్పున విస్తరిస్తారు. అట్లాగే ఉన్నత పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరంలో 6వ తరగతితో ప్రారంభించి ఒక్కో సంవత్సరానికి ఒక తరగతి చొప్పున విస్తరిస్తారు.

| అమలు సం॥ | ప్రాథమిక స్థాయి | ఉన్నత స్థాయి |
|---|---|---|
| 2018-19 | 1వ తరగతి | 6వ తరగతి |
| 2019-20 | 1, 2వ తరగతి | 6, 7వ తరగతి |
| 2020-21 | 1, 2, 3వ తరగతి | 6, 7, 8వ తరగతి |
| 2021-22 | 1, 2, 3, 4వ తరగతి | 6, 7, 8, 9వ తరగతి |
| 2022-23 | 1, 2, 3, 4, 5వ తరగతి | 6, 7, 8, 9, 10వ తరగతి |

- ఇతర మాధ్యమ పాఠశాలల్లో తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులను లేదా విద్యావాలంటీర్లను ప్రభుత్వం నియమిస్తుంది.

- ఏ పాఠశాలలోనైనా రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ రూపొందించిన తెలుగు వాచకాలనే వినియోగించాలి. ఇందుకోసం 2018-19 విద్యా సంవత్సరంలో ఇతర మాధ్యమ పాఠశాలల విద్యార్థులు తెలుగు నేర్చుకోవడానికి 6వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకాలు రూపొందించారు.

- ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 17, తేది : 14-05-2014 ప్రకారం నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని తెలుగు భాష కోసం నిర్వహించాలి. 10వ తరగతిలో ప్రభుత్వం నిర్దేశించిన కనీస ఉత్తీర్ణత మార్కులను పొందాల్సి ఉంటుంది.

- తెలుగు, ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగుతోపాటు ఆంగ్లాన్ని అభ్యసిస్తారు నేర్చుకొంటారు. ఇది గతంలోవలె కొనసాగుతుంది. ఐతే ఇతర మాధ్యమాలు అనగా ఉర్దూ, హిందీ, బెంగాలి, తమిళం కన్నడ, మరాఠి మాధ్యమ పాఠశాలల్లో ఇప్పటి వరకు వారి మాతృభాష, ఆంగ్లాన్ని మాత్రమే నేర్చుకొంటున్నారు. 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగును కూడా తప్పనిసరిగా బోధించాలి. విద్యార్థులు నేర్చుకోవాలి.

- అట్లాగే ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో తెలుగును నేర్చుకొంటున్నారు. ఇది ఇలాగే కొనసాగుతుంది. ఐతే ఇతర మాధ్యమ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరం నుండి తెలుగు, ఆంగ్లం భాషలతోపాటు తృతీయ భాషగా హిందీ / ఉర్దూ / సంస్కృతం / వారి మాతృభాషలలో ఏదైనా ఒక దానిని కూడా నేర్చుకోవచ్చు.



SCERT TELANGANA

- సి.బి.ఎస్.ఇ., ఐ.సి.ఎస్.ఇ., ఐ.బి. పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో రెండు భాషలనే నేర్చుకొంటారు. దీంట్లో ఆంగ్లం తప్పనిసరి. ఐతే ద్వితీయ భాషగా తెలుగు నేర్చుకొనే అవకాశమున్నది. కాని తప్పని సరికాదు. కాబట్టి చట్టం వల్ల తప్పనిసరిగా తెలుగును నేర్చుకోవాల్సి ఉంటుంది. వారి మాతృభాషను తృతీయ భాషగా నేర్చుకోవచ్చు.
- ఐదవ తరగతి వరకు తెలుగు చదువకుండా 6వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థుల కోసం సరళమైన తెలుగు వాచకాలను చదువడం, రాయడం, చేయగలిగేలా రూపొందించారు. 5వ తరగతి వరకు తెలుగు చదివిన వారికి 6వ తరగతిలో సాధారణ తెలుగు వాచకం 'నవ వసంతం'ను వినియోగించాలి. 1వ తరగతిలో కూడా తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో సాధారణ తెలుగువాచకం జాబిలి-1 ని, ఇతర మాధ్యమాలలో 'తేనెపలుకులు'-1 సరళమైన తెలుగు వాచకాన్ని వినియోగించాలి.
- ఎవరైనా పిల్లలు 7వ తరగతి వరకు తెలుగు చదువకుండా '8' వ తరగతిలో లేదా ఆపై తరగతుల్లో మన రాష్ట్రంలో విద్యను అభ్యసించడానికి పాఠశాలల్లో ప్రవేశం పొందితే వారు 'తెలుగు' నేర్చుకోవడాన్ని మినహాయింపునిస్తారు. అయితే దీనికి సంబంధిత జిల్లా విద్యాధికారి ద్వారా సంచాలకులు, పాఠశాల విద్యాశాఖ గారికి దరఖాస్తు సమర్పించి మినహాయింపు పొందాల్సి ఉంటుంది.

## చట్ట ఉల్లంఘన - చేపట్టే చర్యలు

- "తెలుగు తప్పనిసరి చట్టాన్ని" ఉల్లంఘించడం అంటే...
  - ఎ) తెలుగును తప్పనిసరి సబ్జక్టుగా బోధించకపోవడం.
  - బి) తెలుగు భాషోపాధ్యాయుడిని / బోధకుడిని తెలుగును బోధించడానికి కేటాయించకపోవడం.
  - సి) రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రభుత్వ తెలుగు పాఠ్యపుస్తకాలను వినియోగించకపోవడం.
  - డి) చట్టంలో పేర్కొన్న ఇతర నియమాలను పాటించకపోవడం. (Act No.10 off 2018 జి.వో.నెం.15, తేది : 01-06-2018)
- పైన తెల్పిన విధంగా ఏదైనా ప్రైవేటు యాజమాన్యానికి చెందిన పాఠశాలలు తెలుగును తప్పనిసరి బోధనాంశంగా అమలుచేయడంలో విఫలమైతే చట్టాన్ని ఉల్లంఘించినట్లుగా భావిస్తారు. ఈ సందర్భంలో కింది చర్యలు చేపడతారు. అవి :
  - ఏదైనా పాఠశాలలో తెలుగు అమలుతీరు చట్టాన్ని ఉల్లంఘించినట్లు దృష్టికివస్తే జిల్లా విద్యాధికారి నోటీసు జారీ చేస్తాడు. దీనికి సంబంధిత యాజమాన్యం 15 రోజులలోగా జవాబివ్వాలి.
  - జవాబిచ్చిన తర్వాత మళ్ళీ పరిశీలిస్తారు. అయినప్పటికీ చట్ట ఉల్లంఘన కొనసాగితే జిల్లా విద్యాధికారి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళతాడు. జిల్లా కలెక్టరు మొదటి తప్పుగా భావించి 50,000/- (యాభైవేల రూపాయలను) అపరాధ రుసుంను విధిస్తాడు. సదరు పాఠశాల యాజమాన్యం దీని గురించి పాఠశాల విద్యా సంచాలకులకు అప్పీలు చేసుకోవచ్చు.
  - అయినప్పటికీ ఇదే విధంగా రెండవసారి కూడా ఉల్లంఘించినట్లైతే జిల్లా కలెక్టరు గారు సదరు పాఠశాలలకు ఒక లక్ష రూపాయల అపరాధ రుసుమును విధించవచ్చు.
  - అట్లాగే మూడవ సారి కూడా జరిగితే, ఆ పాఠశాల గుర్తింపును రద్దుచేస్తారు. ఇలా గుర్తింపు రద్దైన పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 10వ తరగతి పరీక్షను రాష్ట్రంలోని ఎస్.ఎస్.సి. బోర్డు లేదా సి.బి.ఎస్.ఇ. లేదా ఐ.సి.ఎస్.ఇ. వంటి ఏ బోర్డు కూడా పరీక్షలు నిర్వహించడానికి అవకాశముండదు.

SCERT TELANGANA

**రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలు :**

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో తెలుగును తప్పనిసరిగా బోధించడాన్ని పరిశీలించి చర్యలు చేపట్టడానికి రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని, అట్లాగే జిల్లా కలెక్టరు నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. ఈ కమిటీలు మొదటి సంవత్సరంలో ప్రతి మూడు మాసాలకు ఒకసారి, రెండవ సంవత్సరం నుండి ఆరు మాసాలకొకసారి సమావేశమై సమీక్షించి తగు చర్యలు చేపట్టడానికి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది.

**వృత్యంతర శిక్షణలు :**

- రాష్ట్రంలోని అధికారులు మానిటరింగ్ సభ్యులు, ఉపాధ్యాయులు మొదలగువారందరికీ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ ప్రతి సంవత్సరం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.
- రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ విద్యా కళాశాలల ప్రిన్సిపాళ్ళు, ఉపవిద్యాధికారులకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- అట్లాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల విద్యాధికారులు మొదలగు వారికి జిల్లా విద్యాధికారి నేతృత్వంలో జిల్లాస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

**వనరులను సమకూర్చడం**

- అన్ని పాఠశాలల్లో తెలుగును సమర్థవంతంగా బోధించడానికి, విద్యార్థులు నేర్చుకోడానికి వీలుగా పాఠశాలల్లో, గ్రంథాలయాలను ఏర్పాటుచేయాలి.
- బోధనాభ్యసన సామగ్రిని సమకూర్చాలి.
- సాంకేతికతను వినియోగించాలి. డిజిటల్ పాఠాల బోధనను చేపట్టాలి.
- పాఠశాలల్లో బాలసాహిత్యం పిల్లలకు అందుబాటులో ఉంచడం ద్వారా తెలుగును నేర్చుకొనే వాతావరణాన్ని కల్పించాలి.

**ముగింపు**

తెలంగాణ రాష్ట్రంలో తెలుగును తప్పనిసరి సబ్జక్టుగా అన్ని పాఠశాలల్లో బోధించి పిల్లలు నేర్చుకొనేలా చేయాలి. తద్వారా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు వంటివి పిల్లలు అర్థం చేసుకొని, వాటి గొప్పదనాన్ని గుర్తించి గౌరవించాలి. తెలుగేతరులు తెలుగును నేర్చుకోవడం ద్వారా తెలంగాణ సమాజంతో మమేకమై, ఉన్నతమైన మానవ సంబంధాలను నెలకొల్పాలి. వారి దైనందిన అవసరాలను తీర్చుకోగలగాలి. ఈ సదుద్దేశంతో రూపొందించిన చట్టాన్ని అమలుపరచడంలో మనం అందరం భాగస్వాములం కావాలి.

SCERT TELANGANA

# బాలలపై లైంగిక వేధింపులు – ప్రశ్నోత్తరాల ద్వారా అవగాహనా కల్పన

## బాలల సంరక్షణ – పాఠశాలల పాత్ర

**1.1. పాఠశాలల్లో బాలల సంరక్షణ ప్రణాళిక ఎందుకు ఉండాలి?**

బాలల హక్కులు, బాలల పరిరక్షణ అంశాలు అభ్యుదయ రీతిలో, సమగ్రంగా, బాలలే కేంద్రంగా రూపు దిద్దుకుంటున్నాయి. అందువల్ల పిల్లలతో ప్రమేయం కలిగి ఉండే ప్రతి ఒక్కరూ పిల్లల రక్షణ చర్యలకు సంబంధించి అవగాహన కలిగి ఉండాలి.

> *ఇల్లు తరువాత పాఠశాలలే బాలలకు సురక్షితమైనవి సంతోషాన్ని అందించేవి. కాబట్టి పాఠశాలల్లో శిశు సంరక్షణా పథకం అవసరం.*

**1.2.** రాజ్యాంగంలోని అధికరణ 21 గౌరవంతో జీవించే హక్కును తెలుపుతుంది. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ విద్యా హక్కును కూడా ఈ అధికరణమే వివరిస్తుంది.

**విద్యాహక్కు చట్టం ప్రకారం :** పిల్లలను శారీరకంగా శిక్షించడం (ఉపాధ్యాయులు కొట్టడం వంటివి) వారిపై దాడిగానే పరిగణిస్తారు. ఇది వారి స్వేచ్ఛ, గౌరవాలకు భంగకరం. శారీరక శిక్షలకు భయపడి పిల్లలు బడికి వెళ్లటానికి నిరాకరిస్తారు లేదా శాశ్వతంగా బడికి వెళ్లటం మానేస్తారు. ఈ విధంగా శారీరక శిక్షలు పిల్లల విద్యా హక్కుకు భంగం కలిగిస్తున్నాయి.

**1.3. బాలల హక్కులు, సంరక్షణ, సంస్థాపరమైన బాధ్యతలు:**

UNCRC (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద రైట్స్ ఆఫ్ ద చైల్డ్) నిబంధన 19 ప్రకారం ఈ ఒప్పందంలోని భాగస్వామ్య దేశాలన్నీ పిల్లల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు లేదా బాగోగులు చూసుకునే మరెవరి సంరక్షణలోనైనా ఉన్నప్పుడు లైంగిక వేదింపు, శారీరక లేదా మానసిక హింస, గాయం లేదా వేదింపు, నిర్లక్ష్యం, నిర్లక్ష్య వైఖరి, తిండిపెట్టక పోవడం లేదా దోపిడీలకు గురి కాకుండా చట్ట, పాలనాపర, సామాజిక, విద్యాపరమైన చర్యలను తీసుకోవాలి. అన్ని రకాల వేదింపులు, నిర్లక్ష్యాల నుంచి రక్షణ పొందే హక్కు బాలలకు ఉందని UNCRC స్పష్టం చేస్తోంది.

> *బాలల విద్యార్థి దశలో వారందరికీ రక్షణ కలిగించడమనేది విద్యార్థి దశలో క్లిష్టమైనది. బాలలు 12 సంవత్సరాల పాటు పాఠశాలలలో గడుపుతారు కాబట్టి పాఠశాల యాజమాన్యం, పిల్లల కుటుంబాలు వారి సంరక్షణకై ప్రధాన భూమికను నిర్వహించాలి.*

SCERT TELANGANA

**1.4. విద్యాహక్కు చట్టం 2009 - బాలల హక్కులపై అధ్యయనబాధ్యతలు :**

విద్యా హక్కు చట్టం సెక్షన్ 29 ఏమి చెబుతుందంటే చట్టంలోని సబ్ సెక్షన్ (ఉప నిబంధన) (1) కింద పాఠ్య ప్రణాళిక రూపొందించేటప్పుడు పాఠశాల లేదా విద్యాధికారులు కింది అంశాలను తప్పక పరిగణనలోకి తీసుకోవాలి:

- పాఠ్యాంశాలు రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలి.
- బాలుడు/బాలిక బహుముఖాభివృద్ధి లక్ష్యం కావాలి.
- బాలల జ్ఞానం, సమర్థత, ప్రజ్ఞలను అభివృద్ధి చేయాలి.
- పిల్లల శారీరక, మానసిక సామర్థ్యాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.
- పిల్లలే కేంద్రంగా స్నేహ పూరిత వాతావరణంలో స్వయంగా వారే కనుగొనడం, వెలికి తీయడం వంటి వివిధ కార్యక్రమాల ద్వారా నేర్చుకునేటట్లు చేయాలి.
- బోధన సాధ్యమైనంత వరకు వారి మాతృభాషలోనే సాగాలి.
- పిల్లలు ఎటువంటి భయం, బాధ, ఆందోళన లేకుండా స్వేచ్ఛగా వారి భావాలను వ్యక్తం చేసే వాతావరణం సృష్టించాలి.
- బాలుడు/బాలిక యొక్క జ్ఞాన అవగాహన స్థాయిని, దానిని వారు అనువర్తించే సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు, సమగ్రంగా మూల్యాంకనం చేయాలి.

*ఈ నిబంధనలన్నీ శిశువుకు భయరహిత వాతావరణాన్ని కల్పించడం, పాఠశాలలో ఎలాంటి దాడికి అవకాశం లేకుండా వారి సంరక్షణా యోగక్షేమాలకు ఆస్కారం కల్పించడం ముఖ్యం.*

**2. POCSO చట్టం, 2012 ప్రకారం బాలలపై లైంగిక దుశ్చర్య అంటే ఏమిటి?**

కింది సందర్భాల్లో బాలుడు/బాలిక ఏదైనా లైంగిక కార్యక్రమంలో పాల్గొనడం లేదా ప్రమేయం కలిగి ఉండడాన్ని బాలుడు/బాలిక పై లైంగిక దుశ్చర్యగా చెప్పవచ్చు.

**ఆ సందర్భాలు ఏమిటంటే-**

- బాలుడు/బాలికకు జరుగుతున్నది అర్థం కాకపోవడం.
- బాలుడు/బాలిక తన అసమ్మతిని తెలియచేయలేని అశక్తత.
- బాలుడు/బాలికకు తమ సమ్మతిని తెలియజేసే పరిపక్వత లేనప్పుడు.
- చట్టాన్ని ఉల్లంఘించినప్పుడు లేదా సామాజిక కట్టుబాట్లను అతిక్రమించినపుడు.

ఒక బాలుడు లేదా బాలికను లైంగికానందం కోసం వయోజనుడు లేదా పెద్ద వాడు లేదా జ్ఞానం ఉన్న బాలుడు/బాలిక ఉపయోగించుకుంటే, ఆ చర్య లైంగిక దుశ్చర్య అవుతుంది. ఈ దాడి శారీరకమైనది, మాటలు లేదా ఉద్వేగాలతో కూడుకున్నది కావచ్చు.

**అవి ఏమిటంటే-**

- వస్త్రాన్ని తొలగించి కాని లేదా వస్త్రం పై నుంచి కాని శరీరంలోని ఏ భాగాన్నయినా లైంగికంగా తాకడం.
- చొప్పించే లైంగిక దాడి (నోటి ద్వారా చొప్పించడం కూడా వస్తుంది).
- లైంగిక చర్యకు బాలుడు/బాలికను ప్రేరేపించడం (హస్త ప్రయోగం కూడా ఇందులోకి వస్తుంది).
- బాలుడు/బాలిక ముందు ఉద్దేశపూర్వకంగా లైంగిక చర్యకు పాల్పడడం.
- పిల్లలకు అశ్లీల సాహిత్యాన్ని, చిత్రాలను చూపడం లేదా అశ్లీల చిత్రాల తయారీకి పిల్లను ఉపయోగించుకోవడం.
- ఒక వయోజన వ్యక్తి అతని/ ఆమె రహస్యాంగాలు లేదా మర్మాంగాలను పిల్లలకు చూపడం (ఎగ్జిబిషనిజం).
- పిల్లలను వ్యభిచారం లేదా పడుపు వృత్తిలోకి ప్రోత్సహించడం.
- పిల్లలతో అశ్లీల సంభాషణలు చేయడం.



SCERT TELANGANA

3. **ఉపాధ్యాయుడు ఇలా ఆలోచించాలి...**

**ఎ) బాలలపై లైంగిక దాడి మా పాఠశాలలో ఒక సమస్య కాదు.**

**దీ) నా బాధ్యత విద్యా బోధన, పిల్లల రక్షణ కాదు.**

**జ) బాలలపై లైంగిక వేధింపుల నిరోధం పట్ల చట్టాలు, నియమాలు నేనెందుకు తెలుసుకోవాలి?**

**విద్యావేత్తలు / ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతగా అనుమానాస్పద లైంగిక దాడి లేక అవమానకరమైన పరిస్థితులను తరగతి గదుల్లో భయరహిత వాతావరణం నెలకొల్పడంలో వారి ఫిర్యాదు ముఖ్యం.**

ఆకలి లేదా అనారోగ్యాలవలే ఇతరులు కీడు చేస్తారోమేనన్న భయం, వాటికి సంబంధించిన అనుభవాలు కూడా పిల్లల అభ్యసనను దెబ్బతీస్తాయి. అందువల్ల ఇటువంటి ప్రమాదాలను ముందుగానే పసిగట్టి, తగిన నివారణ చర్యలను తీసుకోవడం పాఠశాల సిబ్బందికే సాధ్యమవుతుంది. అందువల్ల వారి నిరంరత పర్యవేక్షణ ఎంతో కీలకం.

పిల్లల రక్షణ, సంక్షేమాలను పెంపొదించడానికి, వారిని అపాయకర పరిస్థితుల నుంచి తప్పించడానికి పాఠశాలలు, వాటి సిబ్బంది సామాజిక కార్యక్రమాలు; పోలీస్, చట్టం, ఆరోగ్య సేవల్లో పాల్గొని తమ వంతు పాత్రను పోషించాలి.

పాఠశాల సిబ్బంది తమ పిల్లలు (విద్యార్థులు) లైంగిక దాడికి లేదా నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలిసినా లేదా లైంగికదాడికి, నిర్లక్ష్యానికి గురైనా లేదా ప్రస్తుతం అటువంటి పరిస్థితుల్లో ఉన్నా వెంటనే వారు ఎటువంటి అలస్యం చేయకుండా సమాచారాన్ని నిర్దేశిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.

*POCSO చట్టం – 2012లోని సెక్షన్ 21(1) ననుసరించి బాలలపై లైంగిక దాడుల గురించి ఫిర్యాదుచేయడంలో న్యాయశాఖ తగు చర్యలు గైకొనడం, తల్లిదండ్రులు, వైద్యులు, పాఠశాల సిబ్బందికి బాధ్యత కల్పించారు. ఇందులో విఫలమైతే ఫిర్యాదుపై అనుమానం వస్తే అది నేరంగా పరిగణించబడుతుంది. ఈ చట్టం ఫిర్యాదు చేయడంలో సమాచారం అందించడంలో ఆటంకాలు ఉంటే అవి వృత్తిపరమైన విధుల్లో లోపంగాను, విషయ గుప్తతను పాటించడంలో బాధ్యతను గుర్తు చేస్తుంది.*

4. **సమస్యను ఫిర్యాదు చేస్తే ఇక నేను ఆ క్లిష్టమైన విధానాలు, ఇబ్బందుల్లో ఇరుక్కుంటానని చింతపడుతున్నాను. నిజమేనా?**

ఫిర్యాదు చేసినంత మాత్రాన మొత్తం అన్నీ మీరు ఒక్కరే చూసుకోవాల్సిన పని లేదు. పాఠశాల ఉపాధ్యాయుడు/

ఉపాధ్యాయురాలిగా ఒక బాలుడు / బాలిక పై లైంగిక దాడి జరిగిందని తెలిసినా లేదా జరిగే ప్రమాదం ఉందని అనుమానం ఏర్పడినా కేవలం ఆ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో మీ బాధ్యత ముగుస్తుంది.

అయితే, మీరు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు నిబంధలను పాటించాలి. అవి:

- బాలుడు/బాలిక చెప్పింది వినాలి. జరిగిన విషయాన్ని వెల్లడించి మంచి పని చేశారని వారికి మద్దతు ఇచ్చి ధైర్యం చెప్పాలి. ఇక భద్రంగా ఉంటామన్న భావన పిల్లల్లో కలిగించాలి.
- విషయాలను గోప్యంగా ఉంచుతామన్న హామీ ఇవ్వొద్దు. భద్రత కోసమే వివరాలను అవసరమైన వారికి వెల్లడించడం జరుగుతుందని వారికి అర్థమయ్యేలా వివరించాలి.
- నిర్దేశిత అధికారికి లేదా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి లేదా హెల్ప్‌లైన్‌కు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.
- అన్ని సంభాషణలు, తీసుకున్న చర్యల వివరాలను భద్రపరచాలి. ఆలస్యం చేయవద్దు.
- విచారణ మీ బాధ్యత కాదు. పిల్లల రక్షణ కోసం విధుల నిర్వహించే నిపుణులకు ఫిర్యాదు ఇవ్వడంతో మీ పాత్ర ముగుస్తుంది.



SCERT TELANGANA

**5. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నా పాఠశాలలో భద్రతా వాతావరణాన్ని ఎలా సృష్టించగలను?**

**5.1. కనీస అవసరాలు:**

- స్పష్టమైన ఫిర్యాదు మరియు స్పందన వ్యవస్థ కలిగిన ఒక బాలల రక్షణ ప్రణాళిక లేదా విధానాన్ని రూపొందించుకోవాలి.
- స్కూలు సిబ్బందిలో ఒకరిని ఈ బాలల రక్షణ ప్రణాళికకు ఇన్‌చార్జ్‌గా నియమించాలి. అవసరం అయినపుడు సహకారం అందించడానికి డిప్యూటీ ఇన్‌చార్జ్‌ని కూడా ఏర్పాటు చేయాలి.
- బాలల సంరక్షణ చట్టాలు వాటికి సంబంధించిన మార్గదర్శకాలు, రిఫరల్ ఏజెన్సీల గురించి అవగాహన కలిగి ఉండాలి.
- భద్రతా నియమాలు, పాఠశాల విధానాల గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలి. పాఠశాల యాజమాన్య సంఘ సభ్యులకు కూడా వీటి పట్ల అవగాహన ఉండాలి.
- పిల్లలు తాము భద్రమైన, మర్యాదకరమైన, తమను పట్టించుకునే వాతావరణంలో ఉన్నామన్న భావన కలిగించేలా పాఠశాల సంస్కృతి ఉండాలి. అటువంటి వాతావరణాన్ని అభివృద్ధి చేయాలి. వ్యక్తిగత, ఉద్వేగ అభ్యసన, ప్రవర్తనపై కార్యక్రమాలు, వేధింపు నివారణ పట్ల అవగాహన, కార్యక్రమాలలో పాల్గొనడం, విద్యార్థి వేదికలు వంటివి బాలల్లో ఆత్మ విశ్వాసం, తట్టుకునే శక్తి, నమ్మకం వంటి రక్షణాత్మక లక్షణాలు వారి వ్యక్తిత్వంలో రూపుదిద్దుకునేలా చేస్తాయి.
- విద్యార్థులందరికీ వ్యక్తిగత భద్రత గురించి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. లైంగిక దాడి జరిగాక ఫిర్యాదు చేయడం కంటే అటువంటి పరిస్థితులను పసిగట్టి ముందుగానే ఫిర్యాదు చేసి నివారించడం మంచిది.
- భద్రమైన మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన ప్రాంతాలు, తరగతి గదులు, టాయ్‌లెట్లు (మరుగుదొడ్లు), ఆట స్థలాలు శుభ్రంగా, ఆరోగ్య కరంగా ఉండడం కూడా పాఠశాల భద్రతలో భాగమేనని గుర్తించాలి.

**5.2. బాలలపై లైంగిక వేధింపుల గురించి ఫిర్యాదుచేయడం ఎలా?**

ఫిర్యాదుచేసే విధానంలో బాలల యొక్క స్టేట్‌మెంటును POCSO చట్టం ప్రకారం రికార్డు చేయాలి.

రికార్డు చేసేది ఎవరు?

లైంగిక నేరానికి సంబంధించిన బాధ్యతలుగాని, సామాజిక మాధ్యమాల వ్యక్తులు, హాస్టళ్ళు, నివాస గృహాలు, వైద్యశాలలు, క్లబ్బులు, స్టూడియోలు లేదా ఫోటోగ్రఫీ సౌకర్యాలు ఉన్నవారు ఇలాంటి సందర్భం తమ దృష్టికి వచ్చినప్పుడు లైంగిక వేధింపులకు గురైన బాలల గురించి ఫిర్యాదు చేయవచ్చు.

అలాంటి ఫిర్యాదు చేయడంలో వైఫల్యాలున్నట్లైతే వారు శిక్షార్హులే కాకుండా ఆరు మాసాల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూనూ, ఈ జరిమానా శిశువులకు వర్తించదు.

**5.3. ఈ కేసును ఎవరికి రిపోర్టు చేయాలి?**

కేసు గురించి స్పెషల్ జువనైల్ పోలీస్ యూనిట్ (SJPU) లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు రాగానే పోలీసులు లేదా SJP యూనిట్ ఫిర్యాదును రాత పూర్వకంగా తీసుకుని దానికి ఒక నమోదు సంఖ్యను కేటాయిస్తారు. తర్వాత సదరు ఫిర్యాదును ధ్రువీకరణ కోసం ఫిర్యాదుదారుకు చదివి వినిపిస్తారు. తర్వాత దానిని ఒక పుస్తకంలోకి ఎక్కిస్తారు. నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక(FIR) ప్రతిని ఒక దానిని ఫిర్యాదుదారు లేదా సమాచారం ఇచ్చిన వ్యక్తికి ఎటువంటి రుసుము వసూలు చేయకుండా ఇస్తారు.


SCERT TELANGANA

## 5.4. ఫిర్యాదు భాష :

ఒక వేళ కేసును బాలుడు/బాలిక ఫిర్యాదు చేస్తే మాట్లాడినది మాట్లాడినట్టుగా సరళమైన భాషలో నమోదు చేయాలి. ఇలా చేయడం వల్ల బాలుడు/బాలిక ఫిర్యాదులో ఏమి నమోదు చేశారో అర్థం చేసుకోగలుగుతారు. ఒక వేళ వారికి అర్థం కాని భాషలో ఫిర్యాదును నమోదు చేస్తే ఒక అర్హత కలిగిన అనువాదకుడి ద్వారా తర్జుమా చేసి వినిపించాలి.

## 6. *POCSO చట్టం - నిబంధనలు 2018లో తీసుకొనిరాబడిన మార్పులు - చేర్పులు ఏవి?*

***POCSO చట్టం - నిబంధనలు 2018లో తీసుకొనిరాబడిన మార్పులు - చేర్పులు :***

- ఇండియన్ పీనల్ కోడ్ - సెక్షన్ 376 ప్రకారం బాలికలపై అత్యాచారం జరిపిన వారికి 7 నుండి 10 సంవత్సరాలు కనీస శిక్షగా నిర్ధారించడం.
- పై సెక్షన్ 376(3) ప్రకారం 16 సంవత్సరాలలోపు బాలికలపై జరిగే అత్యాచారాలకు కనీస జైలు శిక్ష 20 సంవత్సరాలు / ఆజీవాంతం వరకు పొడిగించబడింది.
- పై సెక్షన్ 376 - A, B ప్రకారం 12 సంవత్సరాలలోపు బాలికలపై అత్యాచారాలకు కఠిన జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించడం.
- పై ఆర్డినెన్సు ప్రకారం 16 సంవత్సరాలలోపు బాలికలపై సామూహిక అత్యాచారాలకు జీవిత ఖైదు మరియు జరిమానా కూడా విధించడం.
- ఈ ఆర్డినెన్సు ప్రకారం 12 సంవత్సరాలలోపు బాలికలపై సామూహిక అత్యాచారాలకు కూడా కఠిన జీవిత ఖైదు మరియు జరిమానా విధించడం.

> *ప్రతి క్షణం విలువైనదే! ప్రతి శిశువు కూడా! ఆ విషయానికొస్తే బాల్య దశ ఎంతో విలువైనది.*
>
> *- కైలాష్ సత్యార్థి*

## 7. శరీరం, వ్యక్తిగత భద్రత

## 7.1. ఉపాధ్యాయుల పాత్ర

- తల్లిదండ్రులు పిల్లలకు శరీర భద్రత గురించి 3 నుంచి 5 సంవత్సరాల వయసు మధ్య కాలం నుంచి బోధించడం ప్రారంభించాలి. ఈ విషయం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.
- పిల్లలకు శరీరాంగాలైన జననేంద్రియాలు, శిశ్నం (లింగం), యోని వంటి రహస్యాంగాలతో పాటు శరీరంలోని అన్ని అంగాలను వివరించి వాటి సరైన పేర్లు చెప్పాలి.
- నిపుణుడు లేదా తల్లిదండ్రులు భాష లేదా పదాల పట్ల ఇబ్బందిగా భావిస్తే చిన్న పిల్లలకు అర్థమయ్యే విధంగా వాడుక పదాలను ఉపయోగించాలి. పిల్లలు కొంచం పెద్దయ్యాక వారికి సరైన పదాలను తెలియ చెప్పాలి. జననాంగాల గురించి చెప్పేటపుడు వాడుక (వ్యవహారిక) పదాలు స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి. అసహ్యం, అవమాన భావనలు కలిగేలా వాటిని పువ్వు, చిలక, సిగ్గు-సిగ్గు, ఛీ-ఛీ వంటి పదాలతో వివరించరాదు. ఈ విషయాన్ని విద్యా బోధకులు, తల్లిదండ్రులు గుర్తు పెట్టుకోవాలి.
- చిన్న వయసు నుంచే పిల్లలను సొంతంగా మల విసర్జన, స్నానం, దుస్తులు ధరించడం నేర్పాలి.
- పిల్లలకు గోప్యత, నమ్రత, వ్యక్తిగత ప్రవర్తనలు, హద్దులు చాల ముఖ్యమని నేర్పాలి.
- పిల్లలకు తమ ఏకాంతాన్ని లేదా గోప్యతను భగ్న పరచేవారిని లేదా హద్దులు దాటి ప్రవర్తించేవారిని అనుమతించకూడదని, అది తప్పు అని తెలియచెప్పాలి. అలాగే ఇతరులు వారి రహస్యాంగాల వైపు చూడడం లేదా తాకడం వంటివి కూడా భావ్యం కాదని చెప్పాలి. ఎందుకంటే పూర్తిగా అవి వారి వ్యక్తిగత అవయవాలని వాటిని గోప్యంగా ఉంచుకోవాలని వివరించాలి.

SCERT TELANGANA

- ఇతరులు చేసే ఇటువంటి పనులకు 'వద్దు' అని చెప్పడం సరైన పద్ధతి అని పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలి.
- పిల్లలకు ఇష్టంలేని వ్యక్తులను ముద్దులు పెట్టుకోమని, కౌగిలించుకోమని తల్లిదండ్రులు బలవంతం చేయరాదు. ముద్దు లేదా కౌగిలింత తనకు ఇష్టం లేదని ఎవరికైనా చెప్పడానికి పిల్లలకు హక్కు ఉంది. వారికి ఉన్న ఆ హక్కును పెద్దలు గౌరవించాలి.
- ఎవరైనా రహస్యాంగాల వంక చూడడం, వాటిని తాకడానికి ప్రయత్నించడం జరిగితే ఆ విషయాన్ని వెంటనే తల్లిదండ్రులకు తెలియచేయాలన్న విషయాన్ని పిల్లలకు తెలియ చెప్పాలి. పిల్లలు చెప్పేది విని సరిగా అర్థం చేసుకుంటారని, నమ్ముతారని, తగిన భద్రత కల్పిస్తారన్న విశ్వాసాన్ని పిల్లలకు తల్లిదండ్రులు కలిగించాలి.
- సహజంగా తాకడం, తగలడం తప్పు లేదని, అయితే ముట్టుకోవడంలో తేడా అనిపించినా లేదా తాకే విధానం భయం కలిగించినా వెంటనే 'నో' చెప్పాలని ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియచేయాలని పిల్లలకు చెప్పాలి.

**7.2. పిల్లలకు మూడు శరీర భద్రత నియమాలు బోధించండి:**

**నేను వ్యక్తిగత శరీర భద్రత నియమాలను పాటిస్తాను**

**నియమం 1 :** వస్త్రానికి సంబంధించిన నియమాలు: ఇతరుల ముందు నా రహస్యాంగాలను కప్పి ఉంచుకుంటాను.

**నియమం 2 :** తాకడానికి సంబంధించిన నియమాలు: ఇతరుల ముందు నా రహస్యాంగాలను తాకను.

**నియమం 3 :** సంభాషణ నియమాలు: నేను రహస్యాంగాల గురించి నమ్మదగిన పెద్దవారితోనే మాట్లడతాను. ఈ భాగాల గురించి నా సందేహాలు, భయాలను వారితో చర్చించి నివృత్తి చేసుకుంటాను.

వ్యక్తిగత శరీర భద్రత నియమాలను తాను పాటిస్తూ ఇతరుల పట్ల కూడా అలానే ప్రవర్తించే వారిని నమ్మదగిన వ్యక్తి (సేఫ్ పర్సన్) అంటారు.

**ఎవరైనా నా పట్ల వ్యక్తిగత శరీర నియమాలను ఉల్లంఘిస్తే నేను...**

- **'వద్దు' (నో)** అని స్పష్టంగా ఆ వ్యక్తికి చెబుతాను.
- **'వెళ్ళు' (గో)** ఆ వ్యక్తి నుంచి **దూరంగా వెళ్లి పోతాను.**

**'చెబుతాను' (టెల్)** ఆ వ్యక్తి గురించి నేను **విశ్వసించే వ్యక్తి (సేఫ్ పర్సన్)తో చెబుతాను.**

*నా భద్రతకు సంబంధించి నష్టం గాని, సమస్య గాని ఎదురైతే నేను సహాయం కోసం '1098' కి కాల్ చేస్తాను.*




**7.3. లైంగిక దాడికి గురైన బాలల ప్రవర్తన సంకేతాలు:**

లైంగిక దాడికి గురైన బాలుడు/బాలికను అనేక ఇతర లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. ముఖ్యంగా ప్రవర్తనా పరంగా వారు–

- దుడుకుగా, తిరస్కార భావంతో ఉంటారు.
- పిరికిగా ఉంటారు లేదా పెద్ద వాళ్లను చూసి భయపడిపోతారు.

SCERT TELANGANA

- దౌర్జన్యం లేదా విధ్వంసక ప్రవర్తన కలిగి ఉంటారు.
- ఇతరులకు లేదా స్వయం వినాశకారులుగా ఉంటారు.
- స్కూలుకు చాలా త్వరగా వస్తారు లేదా స్కూలు విడిచి వెళ్లడానికి ఇష్టపడరు. అలాగే ఇంటిని విడిచి వెళ్లడానికి ఇష్టపడరు.
- నిర్భయత్వాన్ని లేదా తీవ్రమైన తెగింపును ప్రదర్శిస్తారు.
- సాధన శక్తి తక్కువై పోతుంది (సామన్యంగా పిల్లలు తమలోని దూకుడు శక్తిని అభ్యసనగా మార్చుకుంటారు. సంఘర్షణలో చిక్కుకున్న పిల్లలు ఈ పని చేయలేరు).
- సహచరుల (సహ విద్యార్థులు)తో స్నేహ సంబంధాలు ఏర్పరుచుకోలేరు.
- వాతావరణం వేడిగా ఉన్న కాలంలో కూడా ఒంటి నిండా దళసరి దుస్తులు కప్పుకుని వస్తారు (అయితే ఇది సంస్కృతికి సంబంధించిన అంశమని కూడా గుర్తించాలి).
- ప్రతి దానికి వెనుకాడతారు లేదా తక్కువ అపరిపక్వత ప్రదర్శిస్తారు.
- భౌతికంగా కలవడానికి ఇష్టపడరు లేదా ముడుచుకుపోతారు.
- ఎక్కువగా ఏడుస్తారు.
- ఎక్కువగా చిరాకు పడతారు లేదా పెంకితనం ప్రదర్శిస్తారు
- ప్రత్యేకించి ఒక వ్యక్తి లేదా ఒక వస్తువు అంటే భయపడతారు.
- అమర్యాదకర ప్రవర్తన కలిగి ఉంటారు
- ఇతరుల పట్ల దౌర్జన్యపూరితంగా ప్రవర్తిస్తారు.
- బడి కార్యక్రమాల్లో వెనుకబడి ఉంటారు
- పక్క తడపడం (నిద్రలో మూత్ర విసర్జన) లేదా బట్టల్లోనే మల విసర్జన చేస్తారు.
- ప్రవర్తనలో అనూహ్య మార్పు కనబరుస్తారు. (అంటే అన్నిటా ఉత్సాహం ప్రదర్శించే పిల్లలు నిరాసక్తత వ్యక్తం చేస్తారు)
- ఆ వయసు కంటే ఎక్కువగా లైంగిక ప్రవర్తన గురించి తెలుసుకుని ఉంటారు.
- బాలుడు/బాలిక తన జననాంగాలను ద్వేషిస్తారు లేదా తీవ్రమైన రీతిలో అత్యంత గోప్యతను పాటిస్తారు.
- పిల్లలు వారి సొంత జెండర్‌ను ఇష్ట పడరు. అంటే బాలిక స్త్రీత్వాన్ని, బాలుడు పురుషత్వాన్ని ఇష్టపడరు.
- బాలలు తమ సొంత పదజాలాన్ని తగని భాషలో నిరంతరం ఉపయోగిస్తారు లేదా సమాజం ఆమోదించని యాసలో మాట్లాడతారు.

**శారీరక సంకేతాలు**

- నోరు, జననాంగం లేదా గుద ప్రాంతంలో వివరించలేని నొప్పి, వాపు, రక్త స్రావం లేదా ప్రకోపం
- లైంగిక సాంక్రమిక వ్యాధులు (పుండు, స్రావం, జననాంగాల్లో నిరంతరం దురద)
- నడకలో చెప్పశక్యంగాని కష్టం
- తల నొప్పి లేదా కడుపు నొప్పులు పెరగడం

**8. జాగో! బదలో!! బోలో!!!**

పోలీసు, పాఠశాల విద్య, వైద్య – ఆరోగ్య, మహిళా శిశు సంరక్షణ శాఖలు వారి స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ సంవత్సరం కోసం ఓ నినాదాన్ని **జాగో! బదలో!! బోలో!!!** రూపొందించి అక్టోబర్, 2017లో ప్రారంభించారు.

శిశు భద్రతా రక్షణ అనేది మా బాధ్యత.

పాఠశాలలన్నీ అభ్యసనా కేంద్రాలుగా రూపుదిద్దుకొని బాలలకు సంతోషకరమైన, సురక్షితమైన బాల్య దశను అందించాలి.

*ఈ ప్రపంచం బాలలతో నిండి ఉంది. దీనికి మించిన పవిత్ర విశ్వాసం మరొకటి లేదు. బాలల హక్కులను గౌరవించడానికి మించిన మరొక ప్రధాన బాధ్యత అంటూ లేదు. వారి భద్రతను సంరక్షించాల్సి ఉంది. భయ రహిత ప్రశాంత వాతావరణంలో వారు పురోగమించాలి.*

*– కోఫీ అన్నాన్*

# Abbreviations

| | |
|---|---|
| CCIs | Child Care Institutions |
| CEDAW | The Convention on the Elimination of all forms of Discrimination Against Women |
| CPCR | Commission for Protection of Child Rights |
| Cr. PC | Criminal Procedure Code |
| CRIN | Child Rights Information Network |
| CWC | Child Welfare Committee |
| DCPU | District Child Protection Unit |
| DHR | Department of Health Research |
| FIR | First Information Report |
| ICDS | Integrated Child Development Services Scheme |
| ICPS | Integrated Child Protection Scheme |
| IO | Investigation Officer |
| IPC | Indian Penal Code |
| JJ Act | Juvenile Justice (Care and Protection of Children) Act |
| MLC | Medical Legal Care |
| NCPCR | National Commission for Protection of Child Rights |
| NFHS | National Family Health Survey |
| NGO | Non Government Organisation |
| OP3CRC | Third Optional Protocol to the Convention on the Rights of the Child on a communications procedure |
| OPs | Optional Protocols |
| POCSO | Protection of Children from Sexual Offences Act |
| PTSD | Post Traumatic Stress Disorder |
| SCPCR | State Commission for Protection of Child Rights |
| SJPU | Special Juvenile Police Unit |
| UNCRC | United Nations Convention on the Rights of the Child |
| UNICEF | United Nations International Children's Fund |




**1992లో UNCRC బాలల హక్కులను ప్రకటించింది. అవి :**

**జీవించే హక్కు:** పిల్లలకు ఉండే ఈ జీవించే హక్కు కిందకు కనీస అవసరాలైన పోషణ, తలదాచుకోవడానికి గూడు, కనీస జీవన స్థాయి, వైద్య సేవల అందుబాటు వంటి అంశాలు వస్తాయి.

**అభివృద్ధి హక్కు:** ఈ హక్కు కింద పిల్లలు విద్య, ఆటలు, విరామం, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాచారం తెలుసుకునే హక్కులు, స్వేచ్ఛగా ఆలోచించే హక్కు, అభీష్టానికి అనుగుణంగా నడుచుకునే హక్కు, మత స్వేచ్ఛ కలిగి ఉంటారు.

**రక్షణ హక్కు:** ఈ హక్కు పిల్లలను అన్ని రకాల రకాల దుర్వినియోగాలు, నిర్లక్ష్యం, దోపిడిల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఈ హక్కు కిందకు శరణార్థులగా వచ్చిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ, నేర విచారణ వ్యవస్థలో పిల్లలకు రక్షణ, ఉద్యోగాల్లో పిల్లలకు భద్రత, దోపిడి, వేధింపులకు గరైన బాలలకు రక్షణ, పునరావాస కల్పన వస్తాయి.

**పాల్గొనే హక్కు:** పిల్లలు తమ సొంత జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై భావాలను, ఉద్దేశాలను వ్యక్తీకరించే స్వేచ్ఛను ఈ హక్కు ఇస్తుంది. సంఘాలలో చేరడానికి, శాంతియుతంగా సమావేశం కావడానికి ఈ హక్కు వీలు కల్పిస్తుంది. వారి సామర్థ్యాలు పెరిగే కొద్దీ సమాజంలో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొనే అవకాశాలు పెరుగుతాయి. దీని ద్వారా వారు బాల్య దశ నుంచి వయోజన దశకు మారతారు.

SCERT TELANGANA

SCERT TELANGANA

# ప్రారంభ పరీక్ష

పేరు : ______________________ పాఠశాల : ______________________

జిల్లా : ______________________ చరవాణి : ______________________

1) తెలుగు ప్రాథమికోన్నత స్థాయి విద్యాప్రమాణాలు రాయండి.

2) 'స్వీయరచన' అభ్యాసం తరగతి గది నిర్వహణాక్రమం రాయండి.

3) పుస్తక సమీక్షలోని అంశాలు పేర్కొనండి.

4) ప్రాథమికోన్నత స్థాయిలోని మీకు తెలిసిన అభ్యసనా ఫలితాల్లో కొన్ని రాయండి.

5) మీకు తెలిసిన 10 సృజనాత్మక ప్రక్రియలు రాయండి.

SCERT TELANGANA

6) పాఠ్యప్రణాళిక సోపాన క్రమం తెలుపండి.

7) తరగతి గదిలో ఏయే అంశాలను మూల్యాంకనం చేస్తున్నారు?

8) పాఠం అమరిక క్రమాన్ని రాయండి.

9) (NAS) జాతీయ సాధనాసర్వే తెలుగు విషయ పరంగా మీకు తెలిసిన అంశాలు రాయండి.

10) ఏయే అంశాల్లో శిక్షణ అవసరమని భావిస్తున్నారు?

**సంతకం**

SCERT TELANGANA